విలేకరులు కావలెను
తెలంగాణ వాణి
TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
9703247143

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
# తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక
తెలంగాణ వాణి TV
THE VOICE OF TELANGANA
ఎడిటర్ జేరిపోతుల సంపత్
9912758107

సంపుటి: 16 | సంచిక : 139 | ఆదివారం 20. 9. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00

# వరంగల్ ఎయిర్‌పోర్టుకు మంచి పేరు సూచించండి

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ప్రజా ప్రభుత్వం కృషితో వరంగల్ విమానాశ్రయం కల సాకారం కాబోతోంది
- బీఆర్ఎస్ నేతలు పదేళ్లపాటు కుటుంబ ప్రయోజనాలే..
- వరంగల్ విమానాశ్రయం సాధించటంపై దృష్టి సారించలేదు
- విమానాశ్రయం భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.295 కోట్లు కేటాయించడంతో పాటు..
- అవసరమైన భూమిని సేకరించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించడంతో క్షేత్రస్థాయిలో కల
- ఇది కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని.. పరిశ్రమలు, పర్యాటకం,
- విద్య, ఉద్యోగాలు, పెట్టుబడులకు కొత్త గేట్‌వే అని సీఎం అభివర్ణించారు.
- మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు చేపడుతున్న చర్యలు కీలక దశకు చేరుకున్నాయి.
- అనుమతుల దగ్గర నుంచి భూసేకరణ, సాంకేతిక పరమైన పరిశీలన పూర్తి
- నిర్మాణ పనులను మూడు ప్యాకేజీలుగా చేపట్టేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్ణయించింది.
- ఇప్పటికే రెండు ప్యాకేజీల పనులకు వేర్వేరుగా టెండర్లు పిలిచి ప్రక్రియను పూర్తి చేసిన విషయం తెలిసిందే.
- విమానాశ్రయం నిర్మాణాలు జరిగే ప్రాంగణం 953 ఎకరాల చుట్టూ ప్రహరీ నిర్మాణం తొలి ప్యాకేజీలో చేపట్టనున్నారు.
- రన్‌వే, ఆవరణలో పార్కింగ్, సీవరేజ్ వ్యవస్థ నిర్మాణ పనులను రెండో ప్యాకేజీలో ప్రతిపాదించారు.



వరంగల్ ఎయిర్ పోర్టుకు పేరు సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రభుత్వం కృషితో వరంగల్ విమానాశ్రయం కల సాకారం కాబోతోందన్నారు. బీఆర్ఎస్ నేతలు పదేళ్లపాటు కుటుంబ ప్రయోజనాలు, విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లపైనే దృష్టి పెట్టారు తప్ప.. వరంగల్ విమానాశ్రయం సాధించటంపై దృష్టి సారించలేదని విమర్శించారు. విమానాశ్రయం భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.295 కోట్లు కేటాయించడంతో పాటు.. అవసరమైన భూమిని సేకరించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించడంతో క్షేత్రస్థాయిలో కల రూపుదిద్దుకుంటోందన్నారు. ఇది కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని.. పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు, పెట్టుబడులకు కొత్త గేట్‌వే అని సీఎం అభివర్ణించారు. అభివృద్ధి చెందుతున్న, అనుసంధానించబడిన తెలంగాణకు కొత్త చిహ్నంగా నిలవనున్న వరంగల్ మామునూరు విమానాశ్రయం నుంచి ప్రయాణించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు చేపడుతున్న చర్యలు కీలక దశకు చేరుకున్నాయి. అనుమతుల దగ్గర నుంచి భూసేకరణ, సాంకేతిక పరమైన పరిశీలన దశలను దాటుకొని నిర్మాణ పనులను మూడు ప్యాకేజీలుగా చేపట్టేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. ఇప్పటికే రెండు ప్యాకేజీల పనులకు వేర్వేరుగా టెండర్లు పిలిచి ప్రక్రియను పూర్తి చేసిన విషయం తెలిసిందే. విమానాశ్రయం నిర్మాణాలు జరిగే ప్రాంగణం 953 ఎకరాల చుట్టూ ప్రహరీ నిర్మాణం తొలి ప్యాకేజీలో చేపట్టనున్నారు. రన్‌వే, ఆవరణలో పార్కింగ్, సీవరేజ్ వ్యవస్థ నిర్మాణ పనులను రెండో ప్యాకేజీలో ప్రతిపాదించారు. ఇక ఆఖరు ప్యాకేజీ పనులైన టెర్మినల్ భవనం, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్, ఫైర్ స్టేషన్, విద్యుత్తు సబ్‌స్టేషన్ నిర్మాణాలను రూ.213.59 కోట్లతో చేపట్టనున్నారు. ఈ పనులకు సంబంధించి తాజాగా టెండర్లు పిలిచి నవంబరు నాటికి పూర్తయ్యేలా కార్యాచరణను సిద్ధం చేశారు. డిసెంబరులో శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయనున్నట్లు ఏఏఐ వర్గాల ద్వారా తెలిసింది.

## ఎర్రవల్లి భూముల సర్వే

ఎర్రవల్లి: సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం ఎర్రవల్లిలో భూముల సర్వే మరో మలుపు తిరిగింది. కేసీఆర్ ఫామ్‌హౌస్ సమీపంలోని 325 సర్వే నెంబరులో 388 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేస్తున్నారు. అయితే, ఈ భూముల్లో తమకూ వాటా ఉందంటూ శివారు వెంకటాపూర్ గ్రామస్థులు ఆందోళనకు దిగారు. 388 ఎకరాల్లో ఎర్రవల్లి గ్రామస్థులకు 250 ఎకరాలు మాత్రమే ఉందని, మిగిలిన భూమిలో తమకూ హక్కులు ఉన్నాయని వెంకటాపూర్ వాసులు చెబుతున్నారు. కాస్రా, సిత్వార్ రికార్డుల ఆధారంగా సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. గతంలో అధికారులు, సిబ్బంది చేసిన తప్పిదాల కారణంగానే భూ రికార్డుల్లో మార్పులు చోటు చేసుకున్నాయని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేలో తమకు అన్యాయం జరగకుండా చూడాలని అధికారులను కోరుతున్నారు. ఎర్రవల్లిలోని సర్వే నెంబరు 325లో వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు అధికారులు నోటీసులు ఇచ్చారు. విడతల వారీగా నోటీసుల ప్రక్రియ కొనసాగుతోంది. రైతులు భూమి వద్దకు వచ్చి వివరాలు తెలియజేయాలని నోటీసులో పేర్కొన్నారు.

# పార్టీ ఫిరాయింపుల దుష్ట సంస్కృతిని తెచ్చిందే కేసీఆర్

## టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్



హైదరాబాద్:(తెలంగాణ వాణి)
దానం నాగేందర్ విషయంలో కోర్టు తీర్పు బీఆర్ఎస్, కేసీఆర్‌కి చెంపపెట్టు లాంటిదని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. కోర్టు తీర్పును తాము స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం కాంగ్రెస్‌దేనని ధీమా వ్యక్తం చేశారు. "పార్టీ ఫిరాయింపుల దుష్ట సంస్కృతిని తెచ్చిందే కేసీఆర్. తెదేపాలో గెలిచిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను, కాంగ్రెస్‌లో గెలిచిన సబితను బీఆర్ఎస్‌లో చేర్చుకుని మంత్రులను చేశారు. ప్రభుత్వాలను పడగొట్టి.. పార్టీలను చీల్చిన చరిత్ర భాజపాది. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను భాజపా నాశనం చేస్తోంది" అని టీపీసీసీ చీఫ్ వ్యాఖ్యానించారు.

## స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో యువతకు కొత్త అవకాశాలు: మోదీ



భారత్ పలు దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు దేశీయ యువతకు కొత్త అవకాశాలను కల్పిస్తాయని ప్రధాని మోదీ తెలిపారు. దేశీయ నైపుణ్యాలపై ప్రపంచవ్యాప్తంగా విశ్వాసం పెరిగిందన్నారు. వర్చువల్‌గా నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు. కొత్తగా ఎంపికైన అభ్యర్థులకు 51 వేల కంటే ఎక్కువ నియామక పత్రాలను జారీ చేశారు. 'భారత్ ఇప్పటివరకూ 40 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేసింది. వ్యాపారులు, రైతులు, మహిళలు.. ఇలా ప్రతి ఒక్కరికీ కొత్త అవకాశాలు లభిస్తాయి. ప్రపంచంలోనే మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదిగింది. గుర్తింపు పొందిన స్టార్టప్‌లు దాదాపు సగం వరకు టైర్-2 టైర్-3 నగరాల నుంచే పుట్టుకొస్తున్నాయి. దేశీయ లక్ష్యాల సాధనకు యువతే కీలకం' అని మోదీ అన్నారు. యువతకు సమగ్ర అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు.

## పుట్టిన బిడ్డకు బంగారు ఉంగరం!

### సీఎం విజయ్ సర్కార్ కొత్త పథకం

ఎన్నికల హామీ మేరకు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పుట్టిన శిశువులకు గ్రాము బంగారు ఉంగరం

'తైమామన్ తంగ మోతిరం' పేరుతో స్కీమ్ అమలు

ఉపఎన్నికల నేపథ్యంలో రెండు నియోజకవర్గాల్లో పథకానికి ఈసీ బ్రేక్



హైదరాబాద్ తెలంగాణ వాణి) తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వం మరో ప్రతిష్టాత్మక సంక్షేమ పథకానికి శ్రీకారం చుట్టింది. ఎన్నికల హామీ మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించే ప్రతి నవజాత శిశువుకు ఒక గ్రాము బంగారు ఉంగరాన్ని మిగతా 2లో..

## జన్వాడ ఫామ్‌హౌస్‌ను పరిశీలించిన కాంగ్రెస్ నేతలు



హైదరాబాద్:(తెలంగాణ వాణి)
రంగారెడ్డి జిల్లాలోని జన్వాడ ఫామ్‌హౌస్‌ను నాలాపై కట్టారని.. ఈ నిర్మాణానికి అనుమతులు లేవని ఎంపీ మల్లు రవి ఆరోపించారు. ఫామ్‌హౌస్ ఎవరి పేరుపై ఉందో స్పష్టత లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల బృందం జన్వాడ ఫామ్‌హౌస్ వద్దకు చేరుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫామ్‌హౌస్ భూములను పరిశీలించడంతోపాటు అక్రమాల గురించి ప్రజలకు తెలియజేయాలనే ఇక్కడికి వచ్చామన్నారు. బస్సులో ముందు వరుసలో ఎంపీ అనిల్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఉన్నారు. బస్సును అడ్డుకోబోయిన బీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు పక్కకు నెట్టారు. ఇన్ని ఎకరాల్లో ఫామ్‌హౌస్ ఎలా కట్టుకున్నారని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. ఇక్కడ అక్రమాలు జరిగితే నిగ్గు తేలుస్తామన్నారు. ఈ భూములన్నీ సత్యం రామలింగరాజువని, 111 జీవోతో ఆయన ఆస్తులను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.

## కాషాయ జెండాలు పాతి పేదలకు పంచుతాం

### కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై బండి సంజయ్ తీవ్ర ధ్వజం

కేసీఆర్‌కు పుట్టుకతోనే వందల ఎకరాలు లేవనే విషయం తేటతెల్లం



హైదరాబాద్ తెలంగాణ వాణి) సిద్దిపేట భూముల వ్యవహారంపై తెలంగాణ రాజకీయం మరింత వేడెక్కింది. ఈ వివాదంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భూకబ్జాలకు సంబంధించి నిజంగా ఆధారాలు ఉంటే వెంటనే ఆ భూములను స్వాధీనం చేసుకుని కేసీఆర్ కుటుంబంతో మిగతా 2లో..

## బీజేపీ ఓ 'జుమ్లా పార్టీ'

### నందిగ్రామ్‌లో అనూహ్య మలుపు..

కాంగ్రెస్‌కు జై కొట్టిన మమత!

నందిగ్రామ్ బరి నుంచి తప్పుకున్న మమత వర్గం అభ్యర్థి

కాంగ్రెస్ అభ్యర్థికి పూర్తి మద్దతు ప్రకటించిన దీదీ

ఇండియా కూటమి ఐక్యత కోసమే ఈ నిర్ణయమన్న మమత



నందిగ్రామ్: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. నందిగ్రామ్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు తెలుపుతున్నట్లు మాజీ ముఖ్యమంత్రి మిగతా 2లో..

## ఆక్రమిత భూముల్లో ఇందిరమ్మ టవర్స్

### కేసీఆర్, హరీశ్ రావు భూములపై పూర్తి ఆధారాలు

కేసీఆర్ ఓవర్ లాప్ ల్యాండ్‌లో ఉన్నారన్న పొంగులేటి

2004లో ఎకరా చూపించిన కేసీఆర్‌కు వందల కోట్ల భూములు ఎలా

తమ గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదని వ్యాఖ్య



హైదరాబాద్ తెలంగాణ వాణి) బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఓవర్ లాప్ ల్యాండ్‌లో ఉన్నారని, సర్వే అనంతరం వ్యత్యాసాలు బయటపడితే ఆయనకు నోటీసులు ఇస్తామని తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. 2004 ఎన్నికల అఫిడవిట్‌లో కేవలం ఒక ఎకరం భూమి మాత్రమే ఉందని చూపించిన కేసీఆర్‌కు వందల కోట్ల విలువైన భూములు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. తమ భూముల కోసం వచ్చిన దళితులను నిలబెట్టి పసుపు నీళ్లు చల్లించిన చరిత్ర కేసీఆర్ కుటుంబానిదని తీవ్రస్థాయిలో ఆగ్రహం మిగతా 2లో..

## ఇది కాలం తెచ్చిన కరవు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరవు

- మాజీ మంత్రి హరీశ్‌రావు
- "ఈ ఏడాది శ్రీశైలంలో ఇప్పటికే 84 టీఎంసీలు తీసుకున్నట్టు మంత్రి ఉత్తమ్ చెప్పారు
- కల్వకుర్తికి ఇప్పటి వరకు కేవలం 8 టీఎంసీలు మాత్రమే ఎత్తిపోశారు
- కల్వకుర్తికి నీళ్లు ఎత్తిపోసే.. 5 మోటార్లకు గాను కేవలం 2 మోటార్లు నడుపుతున్నారు.
- 2024, 2025లో కృష్ణానదిలో అత్యధిక నీళ్లు వాడుకున్నామని మంత్రి ప్రకటించారు.
- కానీ, ఈ మూడేళ్లలో తెలంగాణ అతి తక్కువ వాడుకున్నట్టు కేఆర్ఎంబీ లెక్కలు చెబుతున్నాయి.
- ఈ మూడేళ్లలో ఏపీ 718 టీఎంసీలు వాడితే.. తెలంగాణ కేవలం 216 టీఎంసీలు వాడింది.
- తెలంగాణ ఏర్పడిన తర్వాత అతితక్కువ వినియోగం 2024-25లో జరిగింది.
- నీళ్లుండి, మోటార్లు ఉండి, వ్యవస్థ ఉండి నడపలేకపోవడమంటే.. ఇది కాలం తెచ్చిన కరవు కాదు,

## ఖైరతాబాద్ ఉపఎన్నికకు బీజేపీ సిద్ధం: కిషన్‌రెడ్డి



హైదరాబాద్:(తెలంగాణ వాణి)
ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ విషయంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్, బీఆర్ఎస్ కు చెంపపెట్టు లాంటిదని కేంద్రమంత్రి కిషన్?రెడ్డి అన్నారు. ఇప్పటికైనా ఈ రెండు పార్టీలు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం, బరితెగించి చట్టాన్ని ఉల్లంఘించడం మానుకోవాలన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు ఏ విధంగా ఎంపీ టికెట్ ఇస్తారని ఇలాంటి అనైతిక పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ఖైరతాబాద్ లో ఉప ఎన్నిక వస్తే అందుకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన పార్టీ ఫిరాయింపుల విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు పెద్ద తేడా లేదని ఈ రెండు పార్టీలు ఒకే రకంగా వ్యవహరిస్తున్నాయని దుయ్యబట్టారు. గతంలో కాంగ్రెస్, టీడీపీ నుంచి గెలుపొందిన సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవన్?ను పార్టీలో చేర్చుకోవడమే కాకుండా ఏకంగా మంత్రి పదవులు ఇచ్చారని బీఆర్ఎస్ గుర్తు తెచ్చుకోవాలన్నారు.

## వాస్తవ మొత్తాన్ని రాబట్టడమే లక్ష్యం

### మంత్రివర్గ ఉపసంఘంతో రైస్ మిల్లర్ల ప్రతినిధుల భేటీ



హైదరాబాద్ తెలంగాణ వాణి) మిల్లర్లను ప్రభుత్వం ప్రత్యర్థులుగా కాకుండా ధాన్యం కొనుగోలు-మిల్లింగ్ వ్యవస్థలో కీలక భాగస్వాములుగా చూస్తున్నదని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ అంశానికి రాజకీయాలతో సంబంధం లేదని.. రైతులు, ప్రభుత్వం, మిల్లర్లు ఒకే వ్యవస్థలో భాగస్వాములనే భావనతో సమస్యను మిగతా 2లో..

## చౌటుప్పల్ పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా ఈడ్దుల మస్తాన్ బాబు బాధ్యతల స్వీకరణ



**చౌటుప్పల్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
చౌటుప్పల్ పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ చైర్‌పర్సన్‌గా ఈడ్దుల మస్తాన్ బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. పీఏసీఎస్ కార్యాలయంలో జిల్లా సహకార అధికారి నాగార్జున ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. పర్సన్ ఇన్‌చార్జి కమిటీ సభ్యులుగా పర్నె శివారెడ్డి, బొబ్బిల్ల రాంజెంధర్, సూర్కంటి లక్ష్మమ్మ, నల్ల నరేందర్ రెడ్డి, జిక్కిడి వెంకట రెడ్డి, రావుల స్వామి, ఎర్ర పెంటయ్య, పానుతులచ్చిరాం, గుర్రం మనోహర్ రెడ్డి, మల్కాపురం సుగుణమ్మ, మేకల దేవేందర్ రెడ్డి, బత్తుల శ్రీహరి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ సురేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ గోశోక వినయ్ కుమార్, కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విచ్చలవిడిగా జీపీఓల అక్రమాలు.. గ్రామాల్లో పెత్తనం



**మల్హర్‌రావు, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
మండల పరిధిలో కొందరు గ్రామ పాలన అధికారులు (జీపీఓ) విధులను పక్కనపెట్టి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పట్టాదారు పాస్‌పుస్తకాల సవరణలు, వివిధ ధ్రువీకరణ పత్రాలు, కళ్యాణలక్ష్మి దరఖాస్తుల పరిశీలన వంటి పనులకు లంచాలు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది అధికారులు కార్యాలయంలో అందుబాటులో లేకుండా బయట ఉండటంతో సర్టిఫికెట్లు, అత్యవసర సంతకాల కోసం వచ్చే విద్యార్థులు, రైతులు, పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. అధికారి ఉన్నచోటికి వెళ్లేందుకు అదనపు ప్రయాణ ఖర్చులు, రోజువారీ కూలీ నష్టం భరించాల్సి వస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే దళారుల ద్వారా పనులు వేగంగా జరుగుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారాలపై ఉన్నతాధికారులు దృష్టిసారించి, ప్రజలకు ప్రభుత్వ సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు

## కోదాడ మెగా జాబ్ మేళాకు విశేష స్పందన



**కోదాడ, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి)**
కోదాడలోని సెయింట్ జోసెఫ్ సీసీఆర్ విద్యానిలయంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాకు యువత నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమాన్ని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పరిశీలించారు. కంపెనీల ప్రతినిధులతో జరుగుతున్న ఇంటర్వ్యూలు, ఎంపిక ప్రక్రియను పరిశీలించిన వారు.. మెగా జాబ్ మేళా ద్వారా యువతకు వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

## చౌటుప్పల్ సింగిల్ విండో చైర్మన్‌గా మస్తాన్ బాబు యాదవ్ నియామకం హర్షణీయం



**చౌటుప్పల్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
చౌటుప్పల్ మండల సింగిల్ విండో చైర్మన్‌గా ఈడుధుల మస్తాన్ బాబు యాదవ్ నియామకంపై తెలంగాణ రాష్ట్ర యాదవ్ జేఏసీ వైస్ చైర్మన్ డా. చిలకల శ్రీనివాస్ యాదవ్, యాదవ్ సంఘం మండల అధ్యక్షుడు చినుకాని మల్లేష్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. యాదవుల అభివృద్ధికి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మస్తాన్ బాబు చేస్తున్న కృషిని గుర్తించి బాధ్యతలు అప్పగించడం అభినందనీయమన్నారు. ఆయనకు బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం మండల అధ్యక్షులు చినుకని మల్లేష్ యాదవ్, గౌరవ అధ్యక్షులు నల్ల పర్వతాలు యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి గంగనబోయిన వెంకటేష్ యాదవ్, జాల మరయ్య యాదవ్, జాల మల్లేష్ యాదవ్ తదితర యాదవ నాయకులు పాల్గొని చైర్మన్ ని ఘనంగా సన్మానించారు.

## ఆరోగ్యవంతమైన తరానికి అంగన్‌వాడీ బాట

**హుజూర్‌నగర్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి)**



హుజూర్‌నగర్ మల్లన్న నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ దగ్గుపాటి శాంతారాజ్యం ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ దత్తగాని శ్రీనివాస్ గౌడ్ పాల్గొని మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందిస్తూ ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, హెల్త్ సూపర్‌వైజర్ పద్మ, సుశీల, సుజాత, సైదాబీ, వల్లభదాసు సైదులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రికి నిరంతర నీరు, విద్యుత్ సరఫరా ఉండాలి

### -ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**జయశంకర్ భూపాలపల్లి, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ప్రభుత్వ ఆసుపత్రిలో మంచినీరు, విద్యుత్ సమస్యలు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి వైద్య, మున్సిపల్, మిషన్ భగీరథ, విద్యుత్, జాతీయ రహదారుల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రికి ప్రత్యేక నీటి సరఫరా లైన్ ఏర్పాటు, నీటి మోటార్ల సామర్థ్యం పెంపు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్, కేబుల్ లైన్ల మరమ్మతులు, అవసరమైన చోట విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేపట్టాలని సూచించారు. ప్రతికూల వాతావరణంలోనూ విద్యుత్ సరఫరా నిలిచిపోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సంబంధిత శాఖలు సంయుక్తంగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కమిషనర్ ఉదయ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు న్యాయ సేవలపై అవగాహన సదస్సు



**బచ్చన్నపేట, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి):**
డీఎల్ఎస్ఏ జనగామ ఆధ్వర్యంలో తుమ్మబాల, వాణి హైస్కూళ్లలో విద్యార్థులకు న్యాయ సేవలు, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సందీప న్యాయ సేవలు, విద్యార్థుల హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. అర్హులు ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలని, చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఫాదర్ బాలారెడ్డి, సుమ, ఉపాధ్యాయులు, ఎస్ఐ శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. సుమారు 500 మంది విద్యార్థులు హాజరయ్యారు

## ఎంబీబీఎస్ సీటు సాధించిన ఆణిముత్యం

### హర్షం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు

**వనపర్తి : సెప్టెంబర్ 19, (తెలంగాణ వాణి ప్రతినిధి)**



వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజపేట గ్రామానికి చెందిన రెట్టల కీర్తిప్రియ సూర్యపేటలో గవర్నమెంట్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు సాధించారు. తండ్రి గంగాధర్ గౌడ్ రాజపేట సబ్ స్టేషన్ లో ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి నర్మద ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పని చేస్తూ కష్టపడి తమ కూతురిని చదివించారు. తమ కూతురు ఎంబిబిఎస్ సీట్ సాధించడం పట్ల తల్లిదండ్రుల హర్షం వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో ఉన్నత విజయాలు సాధించి వైద్యురాలిగా సమాజానికి సేవలు అందించాలని పుట్టిన ఊరికి కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి ఆకాంక్షించారు.

## సింగరేణి కుటుంబాలకు తీపి కబురు..

### ఇళ్ల స్థలాలపై మంత్రి పొంగులేటి కీలక ఆదేశాలు



: రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కుటుంబాలు దశాబ్దాలుగా నివసిస్తున్న తమ ఇళ్ల స్థలాలపై హక్కు పత్రాల కోసం నిరీక్షిస్తున్నాయని, వారి సుదీర్ఘ నిరీక్షణకు ముగింపు పలికేలా చర్యలు చేపడుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సింగరేణి బొగ్గు బెల్ట్ ప్రాంతంలోని ఇళ్ల స్థలాల సమస్యకు చట్టబద్ధమైన పరిష్కారం చూపుతూ, అర్హులైన కుటుంబాలకు హక్కు కల్పించే ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. సింగరేణి కార్మికుల ఇండ్ల స్థలాల సమస్యపై శనివారం సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ.. జీవో 76 పరిగణనలోకి తీసుకొని, భూముల స్వభావం, ప్రభుత్వ/సింగరేణి హక్కులు, ప్రస్తుత నివాస పరిస్థితులు, చట్టపరమైన అంశాలను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు.
సింగరేణి బొగ్గు బెల్ట్ పరిధిలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, కొమురం భీమ్ ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను హైకోర్టు ఆదేశాలకు లోబడి 45 రోజుల్లోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తుల పరిశీలన, పరిష్కారం కోసం ప్రతి జిల్లాలో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ప్రతినిధి, జిల్లా రిజిస్ట్రార్ సభ్యులుగా ఈ కమిటీలు పనిచేస్తాయని తెలిపారు. దరఖాస్తుల పరిశీలనలో ఏవైనా అవకతవకలు లేదా నిబంధనలకు సంబంధించిన అంశాలు గుర్తిస్తే, అమలులో ఉన్న చట్టాలు, నిబంధనల ప్రకారం వాటిని సమీక్షించి తగిన నిర్ణయం తీసుకోవాలని అన్నారు. దశాబ్దాలుగా సింగరేణి ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న కుటుంబాలకు చట్టబద్ధమైన హక్కు కల్పించడం తమ ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని, అర్హులైన కుటుంబాలకు న్యాయం జరిగేలా నిబంధనల ప్రకారం ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు.



## జూరాల డ్యామ్ లో నీళ్లు ఉండి నీళ్లు ఇవ్వలేని ప్రభుత్వం : కేటీఆర్

జూరాల ఆయకట్టు పరిధిలో సాగునీరు, విద్యుత్ సరఫరా సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రైతులకు అవసరమైన సమయంలో సాగునీరు, విద్యుత్ అందకపోతే వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. శనివారం పెబ్బేరు మండలంలోని గుమ్మడం క్రాస్ రోడ్డు వద్ద రైతులతో మాట్లాడిన ఆయన, గుమ్మడం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. సబ్‌స్టేషన్‌లోని లాగ్‌బుక్‌ను పరిశీలించి విద్యుత్ సరఫరా పరిస్థితిపై అధికారులను ఆరా తీశారు. అనంతరం పెబ్బేరు సుభాష్ చౌరస్తాలో నిర్వహించిన రోడ్డు షోలో రైతుల సమస్యలను ప్రస్తావిస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. పెబ్బేరు చౌరస్తాలో చెబుతున్నా యాది పెట్టుకో రేవంత్ అంటూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. జూరాల ఆయకట్టు కింద ఒక్క ఎకరం ఎండినా నిన్ను వదిలిపెట్టే ప్రసక్తే లేదు అని హెచ్చరించారు. రైతుల నుంచి సమస్యలు తెలుసుకున్న కేటీఆర్ గుమ్మడం సబ్‌స్టేషన్ వద్ద రైతులతో కేటీఆర్ నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో సాగు పనులు దెబ్బతింటున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కొందరు రైతులు రోజుకు సుమారు ఐదు గంటలపాటు మాత్రమే విద్యుత్ వస్తోందని, కాలువకు నీరు కూడా అందడం లేదని తమ గోడు వెళ్లబోసుకున్నట్లు వార్తా నివేదికలు పేర్కొన్నాయి. మరోవైపు సబ్‌స్టేషన్ సిబ్బంది ఎక్కువ గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెబుతున్న నేపథ్యంలో వాస్తవ పరిస్థితిని రైతులను అడిగి తెలుసుకోవాలని కేటీఆర్ వ్యాఖ్యానించారు. లో-వోల్టేజీ, తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడం వల్ల వ్యవసాయ మోటార్లు దెబ్బతింటున్నాయని రైతులు చెబుతున్నారని కేటీఆర్ తెలిపారు. పొలాలకు నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. అధికారులు సమాధానం చెప్పాలి విద్యుత్ సరఫరాపై సబ్‌స్టేషన్ అధికారులను కేటీఆర్ ప్రశ్నించారు. విద్యుత్ కోతలపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న సమయంలో అధికారులు సరైన సమాధానం ఇవ్వడం లేదని ఆయన విమర్శించారు. రైతులకు వాస్తవంగా ఎన్ని గంటలు విద్యుత్ సరఫరా అవుతోందో లాగ్‌బుక్‌తో పాటు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని డిమాండ్ చేశారు. . పాలమూరు-రంగారెడ్డికి 90 శాతం పనులు పూర్తిచేశాం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులపై కూడా కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రాజెక్టు పనుల్లో 90 శాతం పూర్తయినప్పటికీ 10 శాతం మిగిలిన పనులను పూర్తి చేయకుండా పాలమూరు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్ ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లి సాగునీటి విస్తరణకు చర్యలు చేపట్టామని ఆయన పేర్కొన్నారు. కృష్ణా జలాలపై తెలంగాణకు స్పష్టమైన ప్రణాళిక ఉండాలి.
కృష్ణా జలాల వినియోగం విషయంలో తెలంగాణ ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అన్నారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తమ నీటి ప్రయోజనాల కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయని, తెలంగాణ మాత్రం ఈ విషయంలో ముందస్తు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఆలమట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచే అంశాన్ని ప్రస్తావిస్తూ భవిష్యత్తులో పాలమూరు ప్రాంతంపై దాని ప్రభావం పడే అవకాశం ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణకు కృష్ణా జలాల్లో దక్కాల్సిన వాటాను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏపీకి నీళ్లు వెళ్తుంటే తెలంగాణకు ఎందుకు రావు పోతిరెడ్డిపాడు, వెలిగొండ తదితర మార్గాల ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు నీరు వెళ్తోందని కేటీఆర్ ఆరోపించారు. జూరాలకు ఎగువ ప్రాంతాల నుంచి నీరు రావడం లేదని చెబుతూ కాలువలకు నీటి విడుదలను నిలిపివేయడంపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. తెలంగాణ రైతులకు సాగునీటి అవసరం ఉన్న సమయంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పంపులను అవసరానికి అనుగుణంగా నిర్వహించి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. సీఎం సొంత ప్రాంతంలోనే రైతులు రోడ్డెక్కుతున్నారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత ప్రాంతానికి సమీపంలోనే రైతులు విద్యుత్, సాగునీటి సమస్యలతో రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని కేటీఆర్ విమర్శించారు.
ముఖ్యమంత్రి సొంత గ్రామం కొండారెడ్డిపల్లి రైతులు కూడా విద్యుత్ సమస్యలపై ఆందోళనకు దిగుతున్నారని ఆయన ప్రస్తావించారు. రైతులను ప్రభుత్వం పట్టించుకోకపోతే ఆందోళనలు మరింత ఉధృతమయ్యే అవకాశం ఉందని కేటీఆర్ హెచ్చరించారు. రైతులు తమ సమస్యలను చెప్పుకునే పరిస్థితి రావడం ప్రభుత్వ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి జూరాల ఆయకట్టు పరిధిలో సాగు చేస్తున్న రైతులకు అవసరమైన మేరకు సాగునీరు అందించాలని, వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. విద్యుత్ సరఫరాలో తరచూ విద్యుత్ కోతలు లేకుండా చూడాలని, పంటలకు నీరు అందేలా సాగునీటి కాలువలను పర్యవేక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## సైబర్ సిటీ అపార్ట్‌మెంట్‌లో ఘనంగా అన్నప్రసాదం



**తెల్లాపూర్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
గణేష్ చతుర్థి ఉత్సవాల్లో భాగంగా 6వ రోజు సైబర్ సిటీ అపార్ట్‌మెంట్‌లో అన్నప్రసాద కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్, కల్చరల్ కమిటీ, బీమాక్ సభ్యులు, స్థానిక నాయకులు, అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు. గణనాథుని ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

## వైద్య ఖర్చులకు రూ.5 లక్షల ఎల్‌ఓసీ అందజేత



**నారాయణపూర్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
నారాయణపూర్ మండలం గుజ్జ గ్రామానికి చెందిన ఎర్ర సైదులు తండ్రి గాలయ్య హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్సీ వైద్య ఖర్చుల కోసం రూ.5 లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. శనివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎల్‌ఓసీని సైదులు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు.

## వినాయక మండపాల్లో దాస్యం వినయ్ భాస్కర్ పూజలు



**తెలంగాణ వాణి, ఉమ్మడి వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 19 :**
ఎన్జీవోస్ కాలనీ, సమ్మయ్యనగర్ కాలనీలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ శనివారం సందర్శించారు. వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మండపాల నిర్వాహకులు, యువత, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీపై నిర్లక్ష్యం.. ఖాళీ కుర్చీలకు వినతిపత్రం

**వనపర్తి, సెప్టెంబర్ 19 (గంధం రవికుమార్, తెలంగాణ వాణి ప్రతినిధి)**



పెబ్బేరు మండలం కొత్తసూగూర్ గ్రామ పంచాయతీలో తొమ్మిది నెలలుగా రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వార్డు సభ్యులు తెలిపారు. సర్పంచ్ కూడా నాలుగు నెలలుగా పంచాయతీ కార్యాలయానికి రావడం లేదని వారు ఆరోపించారు. సర్పంచ్, కార్యదర్శి అందుబాటులో లేక గ్రామ సమస్యలను ఎవరికి చెప్పాలో తెలియని పరిస్థితి నెలకొందని పేర్కొంటూ వార్డు సభ్యులు ఖాళీ కుర్చీలకు వినతిపత్రాలు అందజేసి నిరసన తెలిపారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కే. కురుమన్న, జి. రాంబాబు, జి. రవి పాల్గొన్నారు.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక


# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : డీఎంహెచ్ఓ డాక్టర్ రాజేందర్



**భైంసా, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ రాజేందర్ సూచించారు. భైంసా పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన వైద్య సేవలు, మందుల లభ్యత, సిబ్బంది హాజరు, రికార్డుల నిర్వహణ, వ్యాధి నిర్ధారణ పరీక్షలను పరిశీలించారు. గర్భిణీలు, చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, రోగులతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఆకాష్, బారె రవీందర్, రామచందర్, డాక్టర్ అయేషా ఫిర్దూస్, డాక్టర్ కమలేష్ తదితరులు పాల్గొన్నారు.

# గాలిపూర్ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం




**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
నిజాంసాగర్ మండలం గాలిపూర్ ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ఎఫ్ఎల్ఎన్, విద్యా ప్రగతి, హాజరు, అభ్యసన అంశాలపై చర్చించారు. పాఠశాల మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల అభ్యసన స్థాయి మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు భూనేకర్ సంతోష్, ఉపాధ్యాయులు వీరేందర్, అమూల్య, సుష్మ పాల్గొన్నారు.

# సెంటర్ డివైడర్ లైటింగ్, నిమజ్జన స్థలాన్ని పరిశీలించిన చైర్మన్



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న సెంటర్ డివైడర్ లైటింగ్ పనులను మున్సిపల్ చైర్మన్ శ్రీ పద్మ శ్రీకాంత్ పరిశీలించారు. పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గణేష్ నిమజ్జన స్థలాన్ని పరిశీలించి భక్తులకు ఇబ్బందులు లేకుండా తాగునీరు, విద్యుత్ దీపాలు, పారిశుద్ధ్యం, భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. యువత ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పర్యావరణహితంగా నిమజ్జనం నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె. జగ్జీవన్, వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఐడీఓసీలో వినాయకునికి ప్రత్యేక పూజలు



**నిజామాబాద్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
వినాయక చవితి సందర్భంగా నిజామాబాద్ ఐడీఓసీ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన గణనాథుడికి కలెక్టర్ భవేష్ మిశ్రా, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ వి. భుజంగరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ట్రేసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ్ రెడ్డి, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్వో గీత, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ఏఓ బాలరాజు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ప్రశాంత్, భాస్కర్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# పోరాటాల పునాదులపైనే మాదిగల ఎదుగుదల : మాదిగ మహిళా సమాఖ్య



**నిజామాబాద్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
నిజామాబాద్‌లోని సందీప్ గార్డెన్స్‌లో మాదిగ మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. జాతీయ అధ్యక్షురాలు నంబూరి తబిత మాదిగ మాట్లాడుతూ మాదిగల హక్కుల కోసం చేసిన పోరాటాలను కొనసాగించాలని, ఎంఎస్పీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహిళలు కార్యకర్తలుగా కాకుండా నాయకులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో జె.పి. లతా మాదిగ, పెద్దగీత మాదిగ, గుంటు పద్మ మాదిగ, కరుణ మాదిగ, సత్తెక్క, యమున తదితరులు పాల్గొన్నారు.

# బాల్యం నుంచే మంచి అలవాట్లు అలవర్చుకోవాలి

## జిల్లా కలెక్టర్ రాజర్షి షా




**ఆదిలాబాద్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తలమడుగు మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'ఆరోగ్య పాఠశాల--ఆరోగ్య జాతర', 9వ పోషణ్ మాసం కార్యక్రమాలను కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించారు. విద్యార్థులు బాల్యం నుంచే క్రమశిక్షణ, మంచి అలవాట్లు అలవర్చుకుని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కంప్యూటర్, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని తెలిపారు. అనంతరం పాఠశాలలో నూతన కంప్యూటర్ గదిని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, తహసీల్దార్ రాజ్‌మోహన్, ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రావు, సర్పంచ్ రాజన్న, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర మేనేజర్ సాయికిరణ్, సీడీపీవోలు సురేఖ, సౌందర్య, ఎంఈవో, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# అట్రాసిటీ కేసుల పేరుతో అధికారులను బెదిరిస్తున్న అటెండర్




**నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి)**
జిల్లా గ్రంథాలయంలో అటెండర్ గా విధులు నిర్వర్తిస్తున్న ఓ ఉద్యోగి పై స్థాయి అధికారులను బెదిరిస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. ఏకంగా అనధికారికంగా ఆరు నెలలు విధులకు హాజరు కాకపోయినా అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీనిపై ప్రశ్నించిన పై స్థాయి అధికారిని అట్రాసిటీ కేసు పెడతానంటూ బెదిరించడంతో ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ కార్యాలయంలో విధులు నిర్వర్తించాల్సిన అటెండర్ పై స్థాయి అధికారులకే చుక్కలు చూపిస్తున్న వైనం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఏకధాటిగా విధులకు ఎగనామం పూర్తి వేతనం ఇవ్వాలంటూ, అధికారులపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పేరుతో బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.నిబంధనల ప్రకారం ఆఫీసులో ఉండాల్సిన సదరు వ్యక్తి ,ఆఫీసర్లు వాడే కార్లలో షికార్లు చేస్తూ అధికారులను శాసిస్తున్నాడని సమాచారం.విధి నిర్వహణలో నిలదీయాల్సిన ఉన్నతాధికారులు సైతం ఆయన బెదిరింపులకు భయపడి మిన్నకుండిపోతున్నట్లు తెలుస్తోంది.ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తూ, అధికారులను మానసిక క్షోభకు గురిచేస్తున్న ఈ అటెండర్ పై తక్షణమే శాఖాపరమైన విచారణ జరిపి, సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రంథాలయంలోని ఓ అధికారి కోరుతున్నారు. ఆ కార్యాలయంలో అటెండర్ ఆడింది ఆట పాడింది పాటగా సాగుతుంది. గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు సైతం ఎలాంటి తనదైన శైలిలో సహాయ సహకారాలు అందించకుండా విధులకు డుమ్మా కొడుతున్నట్లు తెలుస్తుంది. తనను ప్రశ్నించిన వారిపై ఎదురు తిరిగి కేసు నమోదు చేయిస్తానంటూ బెదిరించడం ఈ విషయాన్ని అధికారి బహిర్గతం చేయడం ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది. అటెండర్ బెదిరింపులపై ఆందోళనకు గురైన సదరు అధికారి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. అతని వేధింపులు తాళలేకపోతున్నామని, తక్షణమే అటెండర్ పై చర్యలు తీసుకోవాలని అధికారి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# మోక్ష కర్ర గణపతిని దర్శించుకున్న విట్టల్‌రెడ్డి



**లోకేశ్వరం, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
అబ్దుల్లాపూర్‌లో కొలువుదీరిన మోక్ష కర్ర గణపతిని మాజీ ఎమ్మెల్యే జి. విట్టల్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆయనకు ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ సాగర్‌బాయి, మాజీ ఎంపీపీ లలిత, భోజన్న, కాంగ్రెస్ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



**నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి విలేకరి):**
వినాయక నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల తెల్లవారుజామున నిమజ్జన ఘాట్‌లను పరిశీలించారు. భక్తుల భద్రత, బారికేడింగ్, లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణ, పోలీస్ బందోబస్తుపై అధికారులకు సూచనలు చేశారు. శోభాయాత్ర మార్గాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టి, ఘాట్‌ల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల తో పాటు నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు కృష్ణ, సమ్మయ్య, ఎస్ఐలు, బందోబస్తు సిబ్బంది పాల్గొన్నారు

# వ్యర్థాల నిర్వహణపై అవగాహన




**నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి విలేకరి):**
స్వచ్ఛతా హి సేవా ప్రచారంలో భాగంగా జిల్లా గ్రామీణ స్వచ్ఛ భారత్ మిషన్, గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సిబ్బందికి వ్యర్థాల నిర్వహణ, పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌డీఓ అధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ చెత్తను వేరు చేయడం, తగ్గించడం, పునర్వినియోగం, వ్యర్థాల నుంచి సంపద సృష్టించే విధానాలను వివరించారు. పరిశుభ్రమైన గ్రామాల కోసం ప్రజల భాగస్వామ్యం అవసరమని తెలిపారు. అనంతరం సిబ్బందితో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ర్మల్‌లో యువతకు ఉచిత పోలీస్ ఉద్యోగ శిక్షణ



**నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి విలేకరి)**
పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత కోసం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ భవేష్ మిశ్రా సహకారంతో ఉచిత ప్రీ-రిక్రూట్‌మెంట్ శిక్షణ నిర్వహించనున్నట్లు ఎస్పీ డా. జి. జానకి షర్మిల తెలిపారు. ఈ నెల 28 నుంచి నిర్మల్‌లో తరగతులు ప్రారంభమవుతాయని, కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు పోటీ పరీక్షలపై శిక్షణ, మార్గదర్శకత్వం అందిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓను సంప్రదించి బయోడేటా సమర్పించాలని సూచించారు. శిక్షణ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు.

# కులమతాలకు అతీతంగా మానవత్వమే గొప్పది

## ఇండియన్ రెడ్‌క్రాస్, తెలంగాణ ముస్లిం ఏక్తా సొసైటీ



**నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి విలేకరి)**
అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, తెలంగాణ ముస్లిం ఏక్తా సొసైటీ సభ్యులు పిలుపునిచ్చారు. అర్ధరాత్రి అత్యవసరంగా రక్తం అవసరమైన రోగికి యువకుడు అంజాత్ ఖాన్ అమన్ రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. సొసైటీ సభ్యులు షేక్ ముజాహిద్, సాజిద్ తదితరులు ఎప్పుడైనా ప్రజలకు సేవ చేసేందుకు సిద్ధంగా ఉంటారని హబీబ్ జిలాని తెలిపారు. ఈ రక్తదానంలో అంజద్ ఖాన్ అమన్ ఎప్పుడు పిలువగానే వచ్చి రక్తదానం చేయడానికి సిద్ధంగా ఉంటారు అని సొసైటీ ఉపాధ్యక్షులు సాజిద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వాజిద్, ఆఫ్రోజ్ పాషా ఖాన్, ఖానాపూర్ బిఆర్ఎస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు సర్జిల్ ఖాన్, మొఇజ్,తదితర సభ్యులు పాల్గొన్నారు.

# ఐటీ టవర్‌ను పరిశీలించిన కాంగ్రెస్ నేతలు



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బట్టి సావర్గం సమీపంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఐటీ టవర్‌ను డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డితో కలిసి కాంగ్రెస్ నేతలు పరిశీలించారు. త్వరలో ఐటీ టవర్‌ను ప్రారంభిస్తామని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారని తెలిపారు. టవర్ అందుబాటులోకి వస్తే యువతకు ఉద్యోగావకాశాలు, జిల్లాకు ఐటీ రంగంలో అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాజిద్ ఖాన్, గండ్రత్ సుజాత, దుర్గం శేఖర్, బెజ్జంకి అనిల్ కుమార్, అంబకంటి అశోక్, అన్నపూర్ణ, గౌలి సంజయ్, గోక గణేష్ రెడ్డి, తొడసం దౌలత్ రావు, దేరా కృష్ణ రెడ్డి, రుక్మ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గుండాల గోండు గూడలో 'పోలీసులు మీకోసం' కార్యక్రమం : జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**నార్నూర్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రజలకు చేరువై సమస్యలు తెలుసుకుని పోలీసు-ప్రజల సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా గుండాల గోండు గూడలో 'పోలీసులు మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ముఖ్య అతిథిగా పాల్గొని గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజలు సహకరించాలని కోరారు. విద్యార్థులు ఉన్నత విద్యపై దృష్టి సారించాలని సూచిస్తూ 50 పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, సీఐ అంజమ్మ, ఎస్సైలు శ్రీ సాయి, రమ్య, డాక్టర్లు అశోక్, రమా అశోక్, గోపాల్, తౌఫిక్, వంశీ, చంద్రకాంత్, సర్పంచ్ రాథోడ్ సురేష్, పటేల్ కుమ్రా మాల్కో, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, మహిళలు, యువత, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

## అదనపు కలెక్టర్ వి. రాములు



**మంచిర్యాల, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి)**
ఎస్ఐఆర్‌లో విచారణలు పూర్తైన కేసుల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అధికారులను ఆదేశించారు. హాజీపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించారు. పెండింగ్ పనులను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ముల్కల్ల గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తపల్లి హామ్లెట్‌లో రీ-సర్వేలో భాగంగా గ్రామ సరిహద్దుల నిర్ధారణ పనులను పరిశీలించారు. అధికారులు సమన్వయంతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

# లక్ష్యాన్ని నిర్దేశించుకుని శ్రమిస్తే విజయం తథ్యం

## కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు పట్టుదలతో శ్రమిస్తే విజయం తథ్యమని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బీసీ, ఎస్సీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో 200 మంది అభ్యర్థులకు నిర్వహిస్తున్న ఉచిత పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ కోచింగ్‌ను ఆయన ప్రారంభించారు. శిక్షణ పొందుతూ ఉద్యోగాలు సాధించిన కానిస్టేబుళ్లను సన్మానించారు. అభ్యర్థులు భయాన్ని వీడి శిక్షణను సద్వినియోగం చేసుకుని క్రమం తప్పకుండా తరగతులు, పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. మొత్తం 465 దరఖాస్తుల్లో ప్రతిభ ఆధారంగా 200 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సునీత కుమారి, ఎస్సీ, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్లు రమేష్, ప్రవీణ్ కుమార్, ఫ్యాకల్టీ రమణ, మోటివేటర్ సల్ల విజయ బాబు, స్టడీ సర్కిల్ సిబ్బంది, అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.

## క్యాతనపల్లిలో ఘనంగా కుంకుమ పూజ, అన్నదానం




**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి)**
క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్, కాకతీయ కాలనీ, ఎంఎల్‌కే గణేష్ మండలి, ఆంధ్రాబ్యాంక్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద కుంకుమ పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ గొడిసెల సంధ్యారాణి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జానపద కళకు జీవితాన్ని అంకితం చేసిన గుండ్ర కృపాదానం

### అంతర్జాతీయ రోటరీ పురస్కారంతో ఘన సత్కారం

**కరీంనగర్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**




తెలంగాణ జానపద కళారంగానికి నాలుగు దశాబ్దాలకు పైగా సేవలందిస్తున్న గుండ్ర కృపాదానంను అంతర్జాతీయ రోటరీ పురస్కారంతో ఘనంగా సత్కరించారు. హైదరాబాద్‌లో మెగా సిటీ రోటరీ క్లబ్, సంకల్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు జ్ఞాపిక, శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. 1982లో కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీని స్థాపించిన కృపాదానం జానపద కళల ద్వారా సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తూ కళాకారులను ప్రోత్సహించారు. 2007లో అప్పటి రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం పర్యటన సందర్భంగా సుమారు 32 వేల మంది విద్యార్థులతో నిర్వహించిన 'వందేమాతరం' నృత్య ప్రదర్శన ప్రత్యేక గుర్తింపు పొందింది. కార్యక్రమంలో రిజిస్ట్రార్ మల్లేశం మాట్లాడుతూ గురువులు సమాజ నిర్దేశకులని పేర్కొన్నారు.

## అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షునిగా నందయ్య



**ధర్మారం, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి):**
ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ధర్మారం మండల శాఖ అధ్యక్షునిగా బొల్లి నందయ్య నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు లంక సదయ్య నియామక పత్రాన్ని నందయ్యకు అందజేసి, మండలంలోని అన్ని గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేసి సంఘాన్ని బలోపేతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నందయ్య నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, రాష్ట్ర కార్యదర్శి పాల రాజేశం, సీనియర్ నాయకులు పెరుక బానేష్, ఆరుముల్ల బాపు పాల్గొన్నారు.

## పలు సమస్యల పరిష్కారానికి గ్రామసభలో తీర్మానం



**ధర్మారం, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి)**
చామనపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ వేల్పుల రేవతి నాగరాజు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామస్తులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి తాళ్ల కిరణ్, ఉపసర్పంచ్ తీగుళ్ల కవిత సతీష్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు భూష రాజుల శ్రీనివాస్, బెదగం హారిక అంజయ్య, నిట్టు లక్ష్మీ రాజలింగు, తీగుళ్ల రవి కిరణ్, దాసరి సాగర్, ఏఎన్‌ఎం జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ సుందరగిరి చందు, మహిళా సంఘం అధ్యక్షురాలు జుంజుపల్లి అనురాధ, ఆశా వర్కర్ దాసరి సరోజన పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు దూరంగా.. భవిష్యత్తుకు బాటగా

### వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమం



**తిమ్మాపూర్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండి డ్రగ్ రహిత తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఈగల్ ఫోర్స్ ఈస్ట్ ఎస్పీ ఆర్. గిరిధర్ ఐపీఎస్ పిలుపునిచ్చారు. రామకృష్ణ కాలనీలోని వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఎన్‌ఎస్‌ఎస్, ఈగల్ ఫోర్స్ తెలంగాణ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ ఎస్. ఉపేందర్ విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం యాంటీ డ్రగ్స్ పోస్టర్లు విడుదల చేసి, విద్యార్థులతో డ్రగ్ రహిత సమాజ నిర్మాణంపై ప్రతిజ్ఞ చేయించారు. ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన ఇద్దరు విద్యార్థులకు చెరో రూ.1,000 నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో కళాశాల జనరల్ సెక్రటరీ డాక్టర్ గంద్ర శ్రీనివాస్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ డాక్టర్ డి. శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ వి. విశ్వనాథ్ వినోద్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. శ్రీనివాస్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్. సాయినాథ్, ఈగల్ ఫోర్స్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు

## భూభారతి రీసర్వే విజయానికి వినూత్నంగా పనిచేయాలి

### రైతులను చైతన్యపరిచి స్వచ్ఛందంగా భాగస్వాములను చేయాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
భూభారతి రీసర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు వ్యవసాయ అధికారులు వినూత్న ఆలోచనలతో పనిచేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. రైతులకు రీసర్వే ఉద్దేశం, ప్రయోజనాలను వివరించి స్వచ్ఛందంగా భాగస్వాములను చేయాలని, రెవెన్యూ బృందాలు, సర్వేయర్లతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో 70 గ్రామాల్లో రీసర్వే చేపట్టనుండగా ప్రస్తుతం 16 గ్రామాల్లో కొనసాగుతోందన్నారు. ఆయిల్‌పామ్ సాగు విస్తరణపై సైదాపూర్, చిగురుమామిడి మండలాల్లో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ, ఉద్యానవన, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## మన్నెంపల్లిలో ఉద్రిక్తత

### పాత పంచాయతీ భవనం కూల్చివేత..

### సర్పంచ్ ఆత్మహత్యాయత్నం



**తిమ్మాపూర్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
మన్నెంపల్లి గ్రామంలో పాత గ్రామపంచాయతీ భవనం కూల్చివేత ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామసభలో భవనానికి మం ర్మతులు చేసి వినియోగించాలని తీర్మానించినప్పటికీ, అధికా రులు పోలీసు బందోబస్తు మధ్య జేసీబీలతో కూల్చివేశారని సర్పంచ్ పొన్నం సునీత తెలిపారు. కూల్చివేతను అడ్డుకున్న సర్పంచ్ భర్త, పాలకవర్గ సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. భవనం కూల్చివేతతో మనస్తాపానికి గురైన సర్పంచ్ సునీత పంచాయతీ కార్యాలయం వద్ద పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఘటనతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## ఘనంగా హిందీ దివస్ కార్యక్రమం



**భువనగిరి, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి విలేకరి)**
పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గంజ్)లో ప్రధానో పాధ్యాయులు పి. ధనంజయ్ అధ్యక్షతన హిందీ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హిందీ ప్రాముఖ్యత, విద్య, ఉద్యోగ అవకాశాల్లో దాని ఉపయోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు హిందీ పాటలు, నృత్యాలు, ఉపన్యాసాలు, పద్యపఠనంతో ఆకట్టుకున్నారు. వివిధ పోటీల్లో విజేతలకు, గత విద్యా సంవత్సరంలో హిందీలో 10/10 మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాన్ని హిందీ అధ్యాపకులు డా. అబ్దుల్ ఘని, ఏ. సుధాకర్ సమన్వయం చేశారు. సీనియర్ ఉపాధ్యాయులు కే. ప్రభాకర్, ఏవీఎస్‌ఎస్‌ఆర్ మూర్తి, జి. విజయశ్రీ, కే. వెంకటరమణ, ఎం. పావని, కే. మల్లేష్, ఆర్. ఉమా, డి. రామ లింగయ్య, పి. సంతోష్, బి. కృష్ణయ్య, సీహెచ్. శ్రవణ్‌కుమార్, ఆర్. రాము, ఎం. వాణి, ఏ. మాధవరెడ్డి, గాయత్రి, సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్యాంకు సేవలపై విద్యార్థులకు అవగాహన



**శంకరపట్నం, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి)**
మొలంగూర్ ఉన్నత పాఠశాలలో నో బ్యాగ్ డే సందర్భంగా 8 నుంచి 10వ తరగతి విద్యార్థులు స్థానిక ఇండియన్ బ్యాంకును క్షేత్ర పర్యటనగా సందర్శించారు. ఉపాధ్యాయులు శారద, సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ శ్రవణ్, సిబ్బంది నగదు జమ, ఉపసంహరణ, దరఖాస్తుల ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నో బ్యాగ్ డే ద్వారా విద్యార్థులకు ఆచరణాత్మక జ్ఞానం పెరుగుతుందని ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసరావు దేశుముఖ్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శారద, సునీత, బ్యాంకు మేనేజర్ శ్రవణ్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




## తల్లిదండ్రులే మొదటి గురువులు -- హెచ్‌ఎం నూతి మల్లన్న

**ధర్మారం, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి):**
పత్తిపాక ప్రాథమిక పాఠశాలలో శనివారం పేరెంట్స్--టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నూతి మల్లన్న మాట్లాడుతూ తల్లిదండ్రులే పిల్లలకు మొదటి గురువులని, ఇంటి వద్ద విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ స్కిట్లు, పండుగల విశిష్టతపై ఆంగ్లంలో చేసిన ప్రసంగాలు తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీలత, శారద, సిరిపురం సునీల్, అరుణశ్రీ, సౌజన్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ధర్మారంలో ఘనంగా వినాయక ఉత్సవాలు



**కోరుట్ల రూరల్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి)**
ధర్మారం గ్రామంలో ది బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మల్లాపూర్ ఎస్ఐ అనిల్ పాల్గొని వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసి అన్నదాన వితరణలో పాల్గొన్నారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ రంజిత్‌రెడ్డి, యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసిన నంగునూరు సత్యనారాయణ-- జగదాంబ దంపతులు




**రాజాపేట, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి విలేకరి)**
రాజాపేట మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చిత్రాన్న మహాకుంభ నైవేద్య కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నంగునూరు సత్యనారాయణ--జగదాంబ దంపతులు వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. దాతలు ఎక్కడ దేవి--రమేష్ సుజాత దంపతులు కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందించారు. నంగునూరు రాజు--రితిక, బెజుగం శ్రీనివాసులు--రాజేశ్వరి దంపతులు నైవేద్య పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద శర్మ భక్తులకు వేద ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. 18 కిలోల చిత్రాన్న ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గణనాథుని సేవలో అలకుంట రాజేశం



**పెద్దపల్లి, సెప్టెంబర్ 19 (తెలంగాణ జిల్లా ప్రతినిధి**
) రామగుండం, అంతర్గాం, ఎన్టీపీసీ పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న వినాయక ఉత్సవాల్లో పెద్దపల్లి డీసీసీ కో-ఆర్డినేటర్ (జేబీఎం) అలకుంట రాజేశం పాల్గొని పలు గణేష్ మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీలు ఆయనను శాలువాలతో సన్మానించాయి. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, ప్రాంతం అభివృద్ధి చెందాలని గణనాథుడిని ప్రార్థించారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న యువజన సంఘాల సభ్యులను అభినందించారు.

## వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

### డీసీపీ బి. రామ్‌రెడ్డి



**పెద్దపల్లి, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు డీసీపీ బి. రామ్‌రెడ్డి తెలిపారు. గోలివాడ గోదావరి నది వద్ద నిమజ్జన ఏర్పాట్లను ఏసీపీ రమేష్, సీఐ కృష్ణకుమార్‌తో కలిసి పరిశీలించారు. నిమజ్జన మార్గాల్లో గుంతలు, అడ్డంకులు, విద్యుత్ తీగలు, స్తంభాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలు, ఉత్సవ కమిటీలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## అర్హులైన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**హుస్నాబాద్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ఆర్‌సీ)**
హుస్నాబాద్ పట్టణంలో అర్హులైన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు పూదరి వరప్రసాద్ గౌడ్, పిల్లి తిరుపతి, బొలిశెట్టి రాజు, సావల మంజుల, కేశవేణి రమేష్, వైద్యం కిరణ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డేపల్లి వెంకటరమణ, కాంగ్రెస్ నాయకులు బూరుగు కృష్ణస్వామి, బత్తుల రవీందర్, నగేష్, కిరణ్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉషోదయ మిత్రమండలి ఆధ్వర్యంలో అన్నదానం



**పెద్దపల్లి, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
గోదావరిఖని 43వ డివిజన్ పరిధిలోని 5 ఇంక్లైన్‌లో ఉషోదయ మిత్రమండలి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కౌశిక్ హరి హాజరై భక్తులకు అన్నప్రసాదం అందించారు. అనంతరం వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు సేవ చేయడం అభినందనీయమని నిర్వాహకులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ మిత్రమండలి సభ్యులు, భక్తులు, స్థానిక యువకులు, తదితరులు పాల్గొన్నారు

## కేటీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నాయకుడు ఆలేటి గణేష్




**పెద్దపల్లి, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
అంతర్గాం మండలం కుందనపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ఆలేటి గణేష్ తన జన్మదిన సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కేటీఆర్ సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ గణేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని గణేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## రామారావుపల్లి వాసికి రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ

**పెద్దపల్లి, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**



పాలకుర్తి మండలం రామారావుపల్లి గ్రామానికి చెందిన అమ్ముల రామన్న అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) నుంచి రూ. 2. 50 లక్షల విలువైన ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకున్న ఎమ్మెల్యేకు బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎల్‌ఓసీ పత్రాన్ని బాధితుడి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు అన్నం కృష్ణ పటేల్ అందజేశారు.

## చుక్క గంగారెడ్డి విజ్ఞప్తికి జిల్లా యంత్రాంగం స్పందన

### జర్నలిస్టులను అనుమతించాలని ప్రత్యేక సర్క్యులర్




**జగిత్యాల/బుగ్గారం, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి విలేకరి**
) చుక్క గంగారెడ్డి ఈ నెల 7న జగిత్యాల జిల్లా కలెక్టర్ ప్రజావాణిలో సమర్పించిన విజ్ఞప్తిపై జిల్లా యంత్రాంగం స్పందించింది. కలెక్టర్ సూచనల మేరకు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం సెప్టెంబర్ 15న ప్రత్యేక సర్క్యులర్ జారీ చేసి, డీపీవోలు, ఎంపీవోలు, గ్రామపంచాయతీ కార్యదర్శులకు మార్గదర్శకాలు జారీ చేసింది. గ్రామసభలు, సమావేశాలు, అధికారిక కార్యక్రమాలను పారదర్శకంగా నిర్వహించడంతో పాటు మినిట్స్, తీర్మానాలను నమోదు చేయాలని, అవసరమైన చోట సీసీటీవీ, ఆడియో--వీడియో రికార్డింగ్, పోలీస్ భద్రత, అనధికార ప్రవేశ నియంత్రణ వంటి చర్యలు చేపట్టాలని సూచించింది. ప్రజా సమావేశాల నిర్వహణపై జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టడం పట్ల చుక్క గంగారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

## భక్తిశ్రద్ధలతో వినాయక ఉత్సవాలు

### గణనాథుని సన్నిధిలో ఘనంగా మహా అన్నదానం



**ఎండపల్లి, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి)**
జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం పాతగూడూరు గ్రామంలో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు, మహా మంగళహారతి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పాతగూడూరు, పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష



**కోరుట్ల రూరల్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి)**
కోరుట్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి ఎల్. జీవాకర్‌రెడ్డి అధ్యక్షతన మండల స్థాయి అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యవసాయం, ఉద్యానవనం, విద్య, ఐసీడీఎస్, విద్యుత్, ఇంజినీరింగ్, మిషన్ భగీరథ, ఉపాధి హామీ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖల పరిధిలోని పనుల పురోగతి, ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రజలకు అందేలా సమన్వయంతో పనిచేసి, అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ప్రత్యేక అధికారి సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వోదెల రామకృష్ణ, తహసీల్దార్ కృష్ణ చైతన్య, ఆయా గ్రామాల సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు

## చెన్నకేశవ స్వామి దేవాలయానికి హై మస్ట్ లైట్స్ బహుకరించిన ఖయ్యూమ్ , జావేద్



**గుండ్లపల్లి(డిండి )సెప్టెంబర్ 19( తెలంగాణ వాణి ప్రతినిధి)**
గుండ్లపల్లి(డిండి )మండల కేంద్రంలోని శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయానికి హైమాస్ట్ లైట్లు బహుకరించిన ఖయ్యుమ్ జావేద్ సోదరులు ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యానికి మీరు అందించిన ఈ సహకారం ఎంతో అభినందనీయం. ఈ కార్యక్రమంలో డిండి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గడ్డమీది సాయి, 7వ వార్డు సభ్యులు బాలమూరి రాజు, గడ్డమీది కిట్టు, గుడి అంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిండి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గడ్డమీద సాయి మాట్లాడుతూ ఖయ్యూమ్, జావేద్ సోదరులకు శ్రీ చెన్నకేశవ స్వామి వారి ఆశీస్సులు వారిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాము అని తెలియజేశారు.

## మంగల్పేట్ హనుమాన్ మందిరం వద్ద అన్నదానం

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మంగల్పేట్ హనుమాన్ మందిరం వద్ద వినాయక చవితి సందర్భంగా బీఎస్ టెక్స్టైల్స్ వీరన్న పటేల్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ముందుగా హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, వినాయకుడికి పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రామకృష్ణ, వాసవి శేఖర్



షెట్, అంబదాస్, ఎల్లుగొండ నరసింహులు, గ్రామ భక్తులు పాల్గొన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్‌కార్‌ను కమిటీ సభ్యులు సన్మానించారు.

# నర్సరీని సందర్శించిన విద్యార్థులు

### వృత్తి విద్యా వ్యవసాయ కోర్సులో భాగంగా క్షేత్ర సందర్శన

**డిండి, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
డిండి పీఎం శ్రీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, కళాశాల విద్యార్థులు వృత్తి విద్యా వ్యవసాయ కోర్సులో భాగంగా నర్సరీని సందర్శించారు. మొక్కల పెంపకం, విత్తనాల ఎంపిక, నర్సరీ బెడ్ తయారీ, నీటి యాజమాన్యం, షేడ్‌నెట్, సస్యరక్షణ పద్ధతులను ప్రత్యక్షంగా పరిశీలించారు. నర్సరీ నిర్వహణ ద్వారా ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన పొందారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, వ్యవసాయ ఉపాధ్యాయులు బయ్య సందీప్, ఉపాధ్యాయులు బిచ్చయ్య, సోమయ్య, విజయ్, సిబ్బంది పర్యవేక్షించారు.





## గణపతి సన్నిధిలో ఘనంగా అన్నదానం

### భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు





**వీణవంక, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి)**
వల్బాపూర్ గ్రామ శివాలయంలో గణనాథుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో శివాలయ కమిటీ చైర్మన్ రాజ్‌కుమార్, సర్పంచ్ అందె శ్రీమతి కుమార్, ఉపసర్పంచ్ నామాని విజేందర్, వార్డు సభ్యులు న్యాలీ రారాజు, బావు రాకేష్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ పోరెడ్డి తిరుపతిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ శ్రీపతి రెడ్డి, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## జప్తి జాన్కంపల్లిలో పాముకాటు నివారణపై అవగాహన



**నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జప్తి జాన్కంపల్లి గ్రామంలో అంతర్జాతీయ పాముకాటు అవగాహన దినోత్సవం సందర్భంగా ఏఎం సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాముకాటు సమయంలో తీసుకోవాల్సిన తక్షణ జాగ్రత్తలు, చేయకూడని పనులు, సకాలంలో వైద్యం పొందాల్సిన ఆవశ్యకతపై ప్రజలకు వివరించారు. పాముకాటు నివారణ చర్యలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యమని వైద్య సిబ్బంది తెలిపారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

### రూ.10 వేల సాయం అందజేసిన వేముల సుభాష్



**జగిత్యాల/బుగ్గారం, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి విలేకరి)**
బుగ్గారం మండలం మద్దునూర్‌కు చెందిన చాంద్‌పాషా గుండెపోటుతో, పులి లచ్చన్న అనారోగ్యంతో మృతి చెందడంతో జగిత్యాల జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి వేముల సుభాష్ వారి కుటుంబాలను పరామర్శించారు. కుటుంబాల ఆర్థిక పరిస్థితిని తెలుసుకుని ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. వారి సమస్యలను సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ పరంగా సహాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు బత్తుల తిరుపతి, తాండ్ర సత్యనారాయణరావు, బండారు నర్సయ్య, పంచిత ధర్మరాజు, గజ్జెల విజయ్, కుంట మహేష్, కేతిరెడ్డి తిరుపతిరెడ్డి, సుధీర్, సత్తన్న, కరణ్, గజ్జెల సత్తయ్య, దగ్గు మహేష్, గజ్జెల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.





## ధర్మారెడ్డిలో పారిశుధ్య కార్యక్రమం

### స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా నిర్వహణ

**నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా ధర్మారెడ్డి గ్రామంలో సర్పంచ్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల, అంగన్‌వాడీ ఆవరణల్లో పిచ్చిమొక్కలు తొలగించి, తడి--పొడి చెత్తను వేరు చేసి పరిసరాలను శుభ్రం చేశారు. విద్యార్థులకు పరిశుభ్రత, చెత్త నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జయరాజ్, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఉపాధ్యాయులు ప్రతిభ, అంగన్‌వాడీ కార్యకర్త వజ్రవ్వ, మహిళా సంఘం సభ్యులు, వార్డు సభ్యులు సాయిబాబా, లాలు పాల్గొన్నారు.

## మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మూడు అంశాలకు ఏకగ్రీవ ఆమోదం



**జమ్మికుంట, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జమ్మికుంట మున్సిపల్ చైర్‌పర్సన్ మొలుగు ప్రశాంత్‌కుమార్ (దిలీప్) అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో మూడు అంశాలకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. బతుకమ్మ వేడుకల ఏర్పాట్లకు రూ.25 లక్షలు, గాంధీ జయంతి కార్యక్రమాలకు రూ.10 వేలు, పారిశుధ్య సామగ్రి కొనుగోలుకు రూ.2.85 లక్షల వ్యయానికి అనుమతి ఇచ్చారు. మున్సిపల్ ఉద్యోగి కొలుగురి సురేష్ మృతికి సంతాపంగా సభ్యులు ఒక నిమిషం మౌనం పాటించారు. సమావేశంలో వైస్ చైర్మన్ మహ్మద్ ముంతాజ్ అలీ (జావిద్), కమిషనర్ గుట్టల మల్లికార్జునస్వామి, మేనేజర్ జి. రాజిరెడ్డి, ఏఈ వికాస్, టీపీఎస్ వి. రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఐ. రమేష్, ఆర్ఐ ఎ. భాస్కర్, కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఒకే ఇంట్లో ముగ్గురు వైద్య విద్యార్థులు

### విద్యకు నిలువెత్తు నిదర్శనంగా బానోతు కుటుంబం



**హుస్నాబాద్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ఆర్‌సీ)**
హుస్నాబాద్‌కు చెందిన జూనియర్ లెక్చరర్ బానోతు వాల్యానాయక్, బిచ్చమ్మ దంపతులు తమ ముగ్గురు పిల్లలను ఉన్నత విద్య వైపు నడిపిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కుమార్తె బానోతు కృష్ణవేణి వరంగల్‌లో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతుండగా, పెద్ద కుమారుడు బానోతు సంతోష్ కాకతీయ యూనివర్సిటీలో బీ-ఫార్మసీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. చిన్న కుమారుడు బానోతు శ్రీరామ్ భద్రాద్రి కొత్తగూడెం మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో సీటు సాధించాడు. ఈ సందర్భంగా హుస్నాబాద్ బీజేపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు లావుడ్యా రాజన్ నాయక్ ఆధ్వర్యంలో శ్రీరామ్‌ను శాలువాతో సన్మానించారు. ఒకే కుటుంబం నుంచి ఇద్దరు ఎంబీబీఎస్ విద్యార్థులు, ఒక ఫార్మసీ విద్యార్థి ఉండటం హుస్నాబాద్‌కు గర్వకారణమని కొనియాడారు. ప్రతి తల్లిదండ్రులు పిల్లలకు ఉన్నత విద్య అందించాలని వాల్యానాయక్ కోరారు.

## దుర్గంధ సమస్యకు తక్షణ పరిష్కారం చూపిన ఉపసర్పంచ్ విజయ్‌కుమార్



**శంకరపట్నం, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి)**
కేశవపట్నం మండల కేంద్రంలోని ఒకటో వార్డు మెయిన రోడ్డులో దుర్గంధం వెదజల్లుతున్న ప్రాంతాన్ని ఉప సర్పంచ్, వార్డు సభ్యుడు ఆకుబత్తిని విజయ్‌కుమార్ పరిశీలించారు. అక్కడ మృతిచెందిన భారీ పంది కనిపించడంతో జేసీబీతో గుంత తవ్వించి పూడ్చిపెట్టించారు. అనంతరం పారిశుధ్య సిబ్బందితో పరిసరాలను శుభ్రం చేయించారు. సమస్యపై వెంటనే స్పందించిన ఉపసర్పంచ్‌ను స్థానికులు అభినందించారు.

## గోలిలింగాల్‌లో పాముకాటు అవగాహన దినోత్సవం



**నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
గోలిలింగాల్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో అంతర్జాతీయ పాముకాటు అవగాహన దినోత్సవాన్ని నిర్వహించారు. పాముకాటు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయకూడని పనులపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. బాధితులను వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. అనంతరం వీఎచ్ఎన్‌సీ సమావేశంలో ఆరోగ్యం, పారిశుధ్యం, సీజనల్ వ్యాధుల నివారణపై చర్చించారు.

## రీ సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

### వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి: ఇంచార్జి కలెక్టర్ భాస్కర్‌రావు



**రాజాపేట, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి విలేఖరి)**
బసంతాపురంలో జరుగుతున్న రీ సర్వే పనులను జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్‌రావు పరిశీలించి, పనులను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు సర్వే సిబ్బందికి సహకరించాలని సూచించారు. అనంతరం రాజాపేట పీహెచ్‌సీని తనిఖీ చేసి వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యతపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవి కిరణ్‌కుమార్, సర్పంచ్ కోయ మధు, సర్వేయర్ సత్యం, గిర్దావర్ పల్లెపాటి నరసింహులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రహదారిపై గుంతల పూడిచివేత.



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి విలేకరి)**
జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం వర్ష కొండ రెండు వరుసల ప్రధాన రహదారిపై పలుచోట్ల బారీ గుంతలు ఏర్పడటంతో వాహనదారులు స్థానికులు ఇబ్రహీంపట్నం గ్రామ సర్పంచ్ బద్దం గోపి దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామపంచాయతీ నిధులతో ఇబ్రహీంపట్నం వర్షకొండ గ్రామాల మధ్య ప్రధాన రహదారి పై గుంతలు పూడిచి వేయించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాంపల్లి రమేష్, తీగల శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ ఉమా హారతి



**నారాయణఖేడ్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
సంజీవన్‌రావుపేట్ ప్రభుత్వ పాఠశాలను సబ్ కలెక్టర్ ఉమా హారతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల పరిసరాల పరిశుభ్రత, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాలపై అవగాహనను తెలుసుకున్నారు. విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

## కాంగ్రెస్ పార్టీ నాయకులకు సన్మానం




**ధర్మారం, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి)**
ధర్మారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల శాఖ అధ్యక్షుడు ఎల్. రూప్ల నాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, డీసీసీ కార్యదర్శి కొత్త నరసింహులు, కొండగట్టు దేవస్థాన కమిటీ మాజీ డైరెక్టర్ జక్కుల దామోదర్‌లను సూర వెంకటేశం ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బూరగడ్డ శంకర్, గాలి పెల్లి నరసయ్య, నార లచ్చయ్య, గుర్రం శ్రీనివాస్, గూడెపు అన్వేష్, గుండా రాజయ్య, గుర్రం రాజమౌళి, గూడెపు అఖిల్, నాగమల్ల భీమయ్య, బుర్ర తిరుపతి, మొరం కొమురయ్య, సొన్నాయిల గోపి, మోర కొమురయ్య, బూరగడ్డ వీరేశం, మోర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక జీవనంలో మూలాలను మరవొద్దు

### ప్రకృతితో అనుబంధం, ఆరోగ్యకర జీవనశైలికి ప్రాధాన్యం ఇవ్వాలి : శశిధర్‌రెడ్డి

**జమ్మికుంట, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటూనే ప్రకృతి, ఆరోగ్యం, కుటుంబ ఆత్మీయతలకు ప్రాధాన్యం ఇవ్వాలని సామాజికవేత్త ఎల్క శశిధర్‌రెడ్డి సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు పెంచాలని, సమతుల్య ఆహారం, నిత్య వ్యాయామం, ముందస్తు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. స్మార్ట్‌ఫోన్లు, టీవీల వినియోగాన్ని పరిమితం చేసి కుటుంబ సభ్యులతో సమయం గడపాలని సూచించారు. సంప్రదాయ ఆరోగ్యకర అలవాట్లను ఆధునిక జీవన విధానంతో సమన్వయం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## తెలంగాణ వాణి కథనానికి స్పందన

### చిగురుమామిడిలో సర్వసభ్య సమావేశం



**చిగురుమామిడి, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి విలేఖరి):**
మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయన్న తెలంగాణ వాణి కథనానికి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. ఎంపీడీవో రామ్మోహన్‌చారి అధ్యక్షతన సర్పంచులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో పనులు నిలిచిపోయాయని సర్పంచులు తెలిపారు. రేకొండ సర్పంచ్ అల్లెపు సంపత్ పెద్దంపల్లిలో తాగునీటి కోసం రెండు బోర్లు మంజూరు చేయాలని, ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చిటుమల్ల రవీందర్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షుడు మార్క రాజ్ కుమార్, అలువాల శంకర్ ,పలు గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.


తెలంగాణ వాణి

బోసిపోతున్న మండల ప్రజా పరిషత్ కార్యాలయం

చిగురుమామిడి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి విలేఖరి): మండలంలో ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ పదవులు ఖాళీగా ఉండటంతో మండల ప్రజా పరిషత్ కార్యాలయం బోసిపోతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు లేకపోవడంతో గ్రామాల సమస్యలు, అభివృద్ధి అంశాలపై సర్వసభ్య సమావేశాలు నిర్వహించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఎంపీటీసీ తదితర స్థానాలకు ఎన్నికలు నిర్వహించి స్థానిక సంస్థలను బలోపేతం చేయాలని, గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు

## గణపతి నవరాత్రి ఉత్సవాల్లో ఘనంగా మహా అన్నదానం



**జమ్మికుంట, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జమ్మికుంట పట్టణ లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మహా అన్నదానం నిర్వహించారు. కేడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్ పింగిలి రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, పొనగంటి మల్లయ్య పాల్గొని అన్నదానాన్ని ప్రారంభించారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో లారీ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు

## విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేసిన ఉపాధ్యాయుడు రత్నాకర్



**జగిత్యాల/బుగ్గారం, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి విలేకరి):**
సిరికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు వి. రత్నాకర్ మానవతా దృక్పథంతో ఇద్దరు విద్యార్థినులకు సొంత ఖర్చుతో రూ.10 వేల విలువైన సైకిళ్లు అందజేశారు. దూర ప్రాంతాల నుంచి పాఠశాలకు నడిచి వస్తున్న విద్యార్థినుల ఇబ్బందులను గుర్తించి ఈ సాయం చేశారు. గ్రామ సర్పంచ్ ధర్మరాజు చేతుల మీదుగా సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ విజయ్, ఉపాధ్యాయులు, పాలకమండలి సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయుడు రత్నాకర్‌ను సర్పంచ్, ఉపసర్పంచ్, పాలకమండలి సభ్యులు అభినందించారు.

## గణిత, గణాంక శాస్త్రంలో ఎం.నాగేష్‌కు పీహెచ్.డీ.

**పటాన్ చెరు, సెప్టెంబర్ 19, (తెలంగాణ వాణి):**

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత, గణాంక శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి ఎం. నాగేష్ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'ఫైనాన్షియల్ టైమ్ సిరీస్ ఫోర్ కాస్టింగ్ కోసం హైబ్రిడ్ మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ మోడల్స్'పై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత, గణాంక శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి. మల్లికార్జునరెడ్డి శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ నాగేష్ పరిశోధన, ఫైనాన్షియల్ మార్కెట్ల లోని నాన్ లీనియారిటీ (అసరళత), వోలటిలిటీ (అస్థిరత), స్ట్రక్చరల్ బ్రేక్స్ (నిర్మాణాత్మక విఘాతాలు), టైమ్-వేరియింగ్ డిపెండెన్సీస్ (కాలంతో పాటు మారే వాటిపై ఆధారపడటం) వంటి సవాళ్లను పరిష్కరించడానికి, స్టాటిస్టికల్, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ పద్ధతులను ఏకీకృతం చేసి ఒక హైబ్రిడ్ ఫోర్ కాస్టింగ్ ఫ్రేమ్ వర్కును అభివృద్ధి చేస్తుందని తెలియజేశారు. ఈ అధ్యయనం, ARIMA, SVR, LSTM, GRU, and Bidirectional LSTM models, along with hybrid ARIMA-SVR, ARIMA-LSTM, and ARIMA-GRU విధానాలను ఉపయోగించి, నాలుగు ఫైనాన్షియల్ టైమ్ సిరీస్ లను- ప్రపంచ ముడి చమురు ధరలు, భారతదేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్డీఐ) ప్రవాహాలు, నిఫ్టీ ఆటో ఇండెక్స్, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ విశ్లేషిస్తుందని వివరించారు. అధిక అస్థిరత గల డేటా సెట్లపై డీప్ లెర్నింగ్ నమూనాలు బలంగా పనిచేస్తాయని, అయితే స్థూల ఆర్థిక, రంగాల సూచికలకు హైబ్రిడ్ నమూనాలను అధిక కచ్చితత్వం, స్థిరత్వాన్ని అందిస్తాయని ఈ పరిశోధన ఫలితాలు నిరూపిస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా, స్టాక్-ఇండెక్స్ అంచనా కోసం ARIMA-GRU ఒక పటిష్టమైన నమూనాగా నిలుస్తుందన్నారు. ఈ అధ్యయనం డేటా సెట్లకు ప్రత్యేకమైన నమూనా ఎంపిక ప్రాముఖ్యతను విశదీకరిస్తోందని, కచ్చితమైన, అనుకూలమైన, పటిష్టమైన ఆర్థిక అంచనాల కోసం హైబ్రిడ్ విధానాల సామర్థ్యాన్ని ప్రదర్శిస్తుందని వివరించారు.

## పూరి బీచ్‌పై మెరిసిన జీఎంఆర్ సైకత శిల్పం

### ఎమ్మెల్యే జన్మదినానికి అభిమానుల వినూత్న కానుక




**పటాన్‌చెరు, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి)**
పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి 63వ జన్మదినం సందర్భంగా ఒడిశాలోని పూరి సముద్ర తీరంలో ఆయన పేరుతో ప్రత్యేక సైకత శిల్పాన్ని రూపొందించారు. బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు చెన్నారెడ్డి ఆధ్వర్యంలో రూపొందించిన ఈ శిల్పం సందర్శకులను ఆకట్టుకుంది. పూరి పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సైకత శిల్పాన్ని వీక్షించి చెన్నారెడ్డిని అభినందించారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీ పూరి జగన్నాథుడి సన్నిధిలో ఎమ్మెల్యే జీఎంఆర్

### జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి)**
పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తన జన్మదినం సందర్భంగా ఒడిశాలోని పూరి శ్రీ జగన్నాథ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు ఆయనకు వేద ఆశీర్వచనం అందజేశారు. నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పటాన్‌చెరు మరింత అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## తెల్లాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా తల్లిదండ్రుల సమావేశం



**తెల్లాపూర్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
తెల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ--తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి విశిష్ట అతిథిగా హాజరై విద్యార్థుల అభ్యసనలో తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకమని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని, ఇంటి పనిని పర్యవేక్షించాలని, సెల్‌ఫోన్ల వినియోగాన్ని తగ్గించి చదువుపై ఆసక్తి పెంచేలా సహకరించాలని సూచించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న డైరీ విధానం, ప్రతిరోజూ చూచి రాతలు రాయించే పద్ధతిని జిల్లా విద్యాధికారి అభినందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. 9వ తరగతి విద్యార్థి అగ్నిమని ప్రదర్శించిన దుర్యోధనుడి ఏకపాత్రాభినయం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం తెల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని జిల్లా విద్యాధికారి సమీక్షించి, తరగతి గదులను సందర్శించి విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించారు. విద్యార్థుల అభ్యసనాన్ని మరింత మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తోట భాస్కర్, ఉపాధ్యాయులు, ఏఏపీసీ చైర్మన్ ప్రేమలత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## డాక్టర్ సార్లు ఎక్కడ

**చిగురుమామిడి సెప్టెంబర్ 19 ( తెలంగాణ వాణి విలేఖరి )**
కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం, రేకొండ గ్రామంలో గత 15 రోజులుగా విష జ్వరాలతో మంచానపడ్డ గ్రామస్తులు, వైరల్ ఫీవర్ తో జలుబు ,దగ్గుతో ఊపిరాడక సతమతమవుతున్న రోగులు, వైద్యం చేసుకోవడానికి డబ్బు లేక , ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్ళగా, ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళకా నీరసంగా ఉండి నడవరాక ఇంటి వద్దనే బిక్కుబిక్కుమంటున్నా రోగులు, మమ్ముల ఆదుకోండి మహా ప్రభో అని వేడుకుంటున్న, విష జ్వరాల బారిన పడ్డ గ్రామస్తులు, రేకొండలో ఏ వాడ చూసిన, కుటుం బంలో, ఒక్కరు, ఇద్దరు విష జ్వరాల బారిన పడి కొట్టుమిట్టా డుతున్నారు. సంబంధిత వైద్యాధికారులు స్పందించి, గ్రామంలో సర్వే చేపట్టి విష జ్వరాల బారిన పడ్డ బాధితులకు, సరియైన మందులు ఇచ్చి, సంబంధిత రోగం నయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## సైబర్ సిటీ అపార్ట్‌మెంట్‌లో ఘనంగా సరస్వతి పూజ



**తెల్లాపూర్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
గణేష్ చతుర్థి ఉత్సవాల్లో భాగంగా సైబర్ సిటీ అపార్ట్‌మెంట్‌లో చిన్నారుల ఆధ్వర్యంలో సరస్వతి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిన్నారులు భక్తిగీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అనంతరం తల్లిదండ్రులు, అపార్ట్‌మెంట్ వాసులు చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్, కల్చరల్ కమిటీ, బీమాక్ సభ్యులు, స్థానిక నాయకులు, అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణకే ఫ్లాగ్ మార్చ్



**చౌటుప్పల్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకొని చౌటుప్పల్‌లో పోలీసులు శనివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. డీఎస్పీ పి. మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, సాయుధ బలగాలు తంగడపల్లి సరిహద్దు నుంచి తంగడపల్లి చౌరస్తా వరకు మార్చ్ చేపట్టారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ప్రజలు శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు.

## బీమాక్ గేటెడ్ కమ్యూనిటీలో ఘనంగా సరస్వతి పూజ



**తెల్లాపూర్, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
గణేష్ చతుర్థి ఉత్సవాల్లో భాగంగా 6వ రోజు బీమాక్ గేటెడ్ కమ్యూనిటీలో చిన్నారుల కోసం సరస్వతి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిన్నారులు సరస్వతి దేవిని పూజించి విద్యలో రాణించాలని ప్రార్థించారు. అనంతరం భక్తిగీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తల్లిదండ్రులు, కమ్యూనిటీ వాసులు చిన్నారులను అభినందించారు. గణేష్ ఉత్సవాల్లో భక్తి, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ సభ్యులు, చిన్నారులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గణనాథుడి సన్నిధిలో మహా అన్నదానం

### మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదానం




**జమ్మికుంట, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జమ్మికుంటలో మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ మండపం వద్ద శనివారం మహా అన్నదానం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు జి. రాజమౌళి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాల కోసం గణనాథుడిని ప్రార్థిస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బచ్చు తిరుపతి, వోల్లాల మల్లన్న, ముక్క జితేందర్, జుగురు సదానందం, దిండిగాల మల్లయ్య, యాద సతీష్, పుల్లూరి శ్రీనివాస్, వై. సంపత్, ఎల్. మధు, అసోసియేషన్ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీరామ్‌నగర్ గణేష్‌ను దర్శించుకున్న సీఐ, ఎస్ఐ, తహసీల్దార్



**గుండ్లపల్లి (డిండి), సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
గుండ్లపల్లి మండల కేంద్రంలోని శ్రీరామ్‌నగర్ కాలనీ గణేష్ మండపాన్ని సీఐ బిసన్న, డిండి ఎస్ఐ సీహెచ్. బాలకృష్ణ, తహసీల్దార్ హనుమంతు శ్రీనివాస్‌గౌడ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు అధికారులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## గిగ్ వర్కర్లకు హెల్మెట్ల పంపిణీ

### ఎమ్మెల్యే జీఎంఆర్ జన్మదినం సందర్భంగా 'గిఫ్ట్ ఏ స్మైల్'



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి)**
ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి జన్మదినం సందర్భంగా జీఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో పటాన్‌చెరు డివిజన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమం నిర్వహించి గిగ్ వర్కర్లకు హెల్మెట్లు పంపిణీ చేశారు. యువసేన సభ్యుడు సోహైల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్‌రెడ్డి, కుమారుడు గూడెం విక్రంరెడ్డి పాల్గొని హెల్మెట్లు అందజేశారు. రహదారులపై విధులు నిర్వహించే గిగ్ వర్కర్లు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని వారు సూచించారు.

## రేకొండలో వృథాగా పోతున్న గ్రామపంచాయతీ నీరు

### పంపు డ్రైవర్ల నిర్లక్ష్యంపై స్థానికుల ఆవేదన

**చిగురుమామిడి, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి విలేఖరి)**

చిగురుమామిడి మండలం రేకొండ నల్లలబావి వద్ద పైపులైన్ ద్వారా నీటిని మరో బావికి తరలిస్తుండగా, మోటార్ ఆపకుండా వదిలేయడంతో గంటల తరబడి నీరు వృథాగా పోయింది. ఇలాంటి ఘటనలు గతంలోనూ పలుమార్లు జరిగాయని స్థానికులు తెలిపారు. మోటార్లు, వాటర్ ట్యాంకుల వద్ద సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో నీటి వృథా జరుగుతోందని ఆరోపించారు. పైపులైన్ లీకేజీలు, మోటార్ల నిర్వహణపై అధికారులు పర్యవేక్షణ పెంచి, నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఇంద్రేశం ప్రభుత్వ పాఠశాలలో మాతృ వందనం



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 19 (తెలంగాణ వాణి)**
ఇంద్రేశం ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎం ఏనుగు శ్రీనివాసరావు అధ్యక్షతన పీటీఎం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా టీచింగ్--లెర్నింగ్ మెటీరియల్ రూపొందిస్తున్న ఉపాధ్యాయులను తల్లిదండ్రులు అభినందించారు. అనంతరం నిర్వహించిన 'మాతృ వందనం' కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రుల పాదపూజ చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమం తమకు మరచిపోలేని అనుభూతినిచ్చిందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేసి హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

# చరణి స్పిన్‌కు జపాన్ విలవిల..

### ఆసియా క్రీడల సెమీఫైనల్లో భారత్..!

**న్యూఢిల్లీ:** ఆసియా క్రీడల్లోనూ భారత మహిళల జట్టు అదరగొట్టింది. క్వార్టర్ ఫైనల్లో తిప్పేసిన శ్రీ చరణి(4-10) కెరీర్లోనే అత్యుత్తమ గణాంకాలు నమోదు చేయడంతో అలవోకగా జపాన్(జీుజుఖఅ)ను చిత్తు చేసింది టీమిండియా. స్వల్ప ఛేదనలో ఓపెనర్ షఫాలీ వర్మ(40 నాటౌట్, 2-13) విధ్వంసక బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లను బెంబేలెత్తించింది. ఎనిమిది వికెట్ల తేడాతో భారీ విజయం సాధించిన ఉమెన్ ఇన్ బ్లూ సెమీస్‌కు దూసుకెళ్లింది.

డిఫెండింగ్ ఛాంపియన్‌గా ఆసియా కప్‌లో అడుగుపెట్టిన భారత జట్టు టైటిల్ నిలబెట్టుకునే దిశగ సాగుతోంది. నిరుడు గోల్డ్ మెడల్‌తో సత్తా చాటిన హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం.. దర్జాగా సెమీస్‌లో దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో జపాన్ బ్యాటర్లను శ్రీ చరణి(4-10) వణికించింది. ఈ తెలుగమ్మాయి సంచలన ప్రదర్శనరతో 57 పరుగులకే ఆతిథ్య దేశం జట్టు కుప్పకూలింది. అనంతరం ఓపెనర్ షఫాలీ వర్మ(40 నాటౌట్) తుఫాన్ ఇన్నింగ్స్‌తో 5 ఓవరల్లోనే ఉమెన్ ఇన్ బ్లూ జయకేతనం ఎగురవేసింది.






చరణి, షఫాలి పోటీపడి

తొలుత బ్యాటింగ్ చేసిన జపాన్‌ను భారత స్పిన్నర్లు స్వల్ప స్కోర్‌కే కట్టడి చేశారు. ఓపెనర్ అయకా కటో స్టఫోర్డ్(25) ప్రతిఘటించినా.. శ్రీ చరణి(4-10), షఫాలీ వర్మ(2-13)ల ధాటికి మిగతా వారు ఇలా వచ్చి అలా వెళ్లారు. ఒకే ఓవర్లో రెండేసి వికెట్లతో చరణి జపాన్‌ను కోలుకోలేని దెబ్బకొట్టింది. ఈ స్పిన్ ద్వయం వికెట్ల వేటతో ప్రత్యర్థిని 57కే పరిమితం చేసింది టీమిండియా. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని ఐదు ఓవర్లలోనే టీమిండియా ఉఫ్‌మనిపించింది.

ఓపెనర్ షఫాలీ వర్మ(40 నాటౌట్) మెరుపు అరంభాన్నిస్తూ.. 15 బంతుల్లోనే ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో విరుచుకుపడింది. జి.కమలిని(0), భారతి ఫుల్‌మాలి(6)లు విఫలమైనా షఫాలి దూకుడుతో జపాన్ బౌలర్లు అల్లాడిపోయారు. రీచా ఘోష్(12 నాటౌట్) జతగా టీమిండియాకు 8 వికెట్ల విజయం కట్టబెట్టింది డాషింగ్ ఓపెనర్. అద్భుత విజయంతో సెమీస్ చేరిన భారత్.. ఫైనల్ బెర్తు కోసం సెప్టెంబర్ 20వ తేదీన బంగ్లాదేశ్‌ను ఢీ కొట్టనుంది. అదే రోజు ఉదయం తొలి సెమీస్‌లో పాకిస్థాన్, శ్రీలంక తలపడనున్నాయి.

## అథ్లెట్లకు మరో సవాల్..

### నగోయ నగరానికి తుఫాన్ ముప్పు..!




**జపాన్:** జపాన్ ఆతిథ్యమిస్తున్న ఆసియా క్రీడల్లో అథ్లెట్లకు వసతులు సవాల్ విరుసుతున్నాయి. ఇది చాలదన్నట్టు వాతావరణం కూడా క్రీడాకారులను పరీక్షించనుంది. ఐచీ నగొయ వేదికగా జరుగుతున్న ఈ మెగా టోర్నీకి తుఫాన్ ముప్పు పొంచి ఉంది. తీర ప్రాంతమైన ఈ నగరంలో రాబోయే రోజుల్లో గంటకు 100 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశముందని సమాచారం. వాతావరణ శాఖ హెచ్చరికతో అప్రమత్తమైన నిర్వాహకులు అలాంటి విపత్కర పరిస్థితి ఏర్పడితే.. తాత్కాలికంగా అథ్లెట్లను తరలిస్తామని వెల్లడించారు.

పద్దెనిమిదో ఆసియా క్రీడలకు విచ్చేసిన అథ్లెట్లకు కంటెయినర్లలో, పెద్ద ఓడలో వసతి ఏర్పాట్లపై పలు దేశాలు పెదవి విరుస్తున్నాయి. క్రీడాకారుల వసతులపై ఇప్పటికే విమర్శలు ఎదుర్కొంటున్న జపాన్.. రాబోయే రోజుల్లో తుఫాన్ తీవ్రతను చవిచూడనుంది. సముద్ర తీర ప్రాంతమైన ఐచీ నగొయలో ఉష్ణమండల తుఫాన్ దుజాన్ కారణంగా భారీ వర్షంతో పాటు బలమైన గాలులు వీచే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

ఈ తుఫాన్ మధ్య జపాన్ వైపు కదిలిందని ..సెప్టెంబర్ 21 సోమవారం ఇది ఆతిథ్య నగరానికి విస్తరించనుందని సమచారం. దీని ఫలితంగా గంటకు 90 నుంచి 126 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచేందుకు ఆస్కారముందని వాతావరణ శాఖ చెబుతోంది. ఈ విషయంపై నగోయ మేయర్, ఆసియా క్రీడలకు ఉపాధ్యక్షుడిగా వ్యహరిస్తున్న ఐచిరో హిరోసవా మీడియాతో మాట్లాడుతూ.. వర్షంలోనూ టోర్నీ కొనసాగుతుందని చెప్పాడు. ఒకవేళ.. తుఫాన్ తీవ్రతకు బలమైన గాలులు వీస్తే.. క్రీడాకారులను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని ఆయనపేర్కొన్నాడు.

'సాధారణ వర్షం కురిసినా ఆసియా క్రీడలు యథావిధిగా జరుగుతాయి. ఒకవేళ భారీ వర్షం, తుఫాన్ హెచ్చరికలు వస్తే అథ్లెట్లను తాత్కాలికంగా మరో ప్రాంతానికి తరలిస్తాం. ఇక క్రీడాకారులకు బస ఏర్పాటు చేసిన ఇటాలియన్ క్రూయిష్ షిప్‌ను కూడా తీరం నుంచి సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్తాం' అని హిరోసవా వెల్లడించాడు. ఆసియా క్రీడలు సెప్టెంబర్ 19న మొదలై.. అక్టోబర్ 4 వ తేదీన ముగియనున్నాయి.

## అగార్కర్ భవితవ్యంపై ఊగిసలాట..

### బీసీసీఐ నిర్ణయం తీసుకునేనా..!



**న్యూఢిల్లీ:** భారత సీనియర్ పురుషుల క్రికెట్ జట్టు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ భవితవ్యంపై ఊగిసలాట కొనసాగుతోంది. అక్టోబర్‌లో అగార్కర్ పదవీ కాలం ముగియనుండమే అందుకు కారణం. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ వరకూ అతడినే కొనసాగిస్తారా? లేదా తదుపరి చీఫ్ సెలెక్టర్‌గా కొత్త వారిని ప్రకటిస్తారా? అనేది తెలియాల్సి ఉంది. ఇప్పటివరకూ ఈ అంశంపై బీసీసీఐ నిర్ణయం తీసుకోలేదు. అయితే.. శుక్రవారం వార్షిక సమావేశంలో అగార్కర్ గురించి చర్చించే అవకాశముందని, ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిందిగా సభ్యులను బీసీసీఐ ఆదేశించినట్టు సమాచారం.

చీఫ్ సెలెక్టర్‌గా సంచలన నిర్ణయాలతో అజిత్ అగార్కర్ వార్తల్లో నిలిచారు. సీనియర్లను కాదని జూనియర్లకు అవకాశమివ్వడం, కోచ్ గౌతం గంభీర్‌తో కలిసి కుర్రాళ్లను పరీక్షించడం వంటివి కొంతవరకు సత్ఫలితాలనే ఇచ్చాయి. ఈ నేపథ్యంలో అతడి పదవీకాలం ముగిసేందుకు నెల రోజులే ఉంది. వెస్టిండీస్‌తో వన్డే, టీ20లకు స్క్వాడ్ ప్రకటన అనంతరం.. అగార్కర్ భవితవ్యంపై ఏదో ఒక నిర్ణయం వస్తుందని అంతా ఊహించారు.

కానీ, బీసీసీఐ మాత్రం హడావిడికి చోటివ్వకుండా.. ఇంకా టైమ్ ఉందిలే అన్నట్టుగా వ్యవహరిస్తోంది. అయితే.. క్రిక్‌బజ్ కథనం ప్రకారం శుక్రవారం జరిగిన 95వ బోర్డు వార్షిక సమావేశంలో అగార్కర్ గురించి ఓ నిర్ణయానికి రావాలని సభ్యులకు బీసీసీఐ సూచించిందని సమాచారం. అలానే జూనియర్ క్రికెట్ టీమ్ సెలెక్టర్ల మార్పుపై కూడా స్పష్టత రానుందని టాక్. ఒకవేళ అగార్కర్‌కు బీసీసీఐ గుడ్‌బై చెబితే.. తదుపరి చీఫ్ సెలెక్టర్ రేసులో మాజీ ఆటగాళ్లు పార్థివ్ పటేల్, ప్రజ్ఞాన్ ఓఝాలు ఉన్నారనే వార్తలు వస్తున్నాయి.

#### రెండు వరల్డ్‌కప్‌లు

టీమిండియా చీఫ్ సెలెక్టర్‌గా అజిత్ అగార్కర్ హయాం మిశ్రమ ఫలితాలనిచ్చింది. అతడు బాధ్యతలు చేపట్టిన కొన్ని రోజుల్లోనే వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత జట్టు అనూహ్యంగా ఓడిపోయింది. కానీ, మరుసటి ఏడాది పొట్టి ప్రపంచకప్‌ను ఒడిసిపట్టింది భారత్. 2024లో రోహిత్ శర్మ బృందం దక్షిణాఫ్రికాను చిత్తు చేసి రెండోసారి టీ20 వరల్డ్‌కప్ ఛాంపియన్‌గా నిలిచింది.




## బిజినెస్ Business

## భారతదేశంలో అమెజాన్ ఆల్-న్యూ అలెక్సాం

### ఇంగ్లిష్, హిందీ, హింగ్లిష్‌లో సహజ సంభాషణతో సేవలు






**విశాఖపట్నం, అక్షిత ప్రతినిధి :** అమెజాన్ భారతదేశంలో జనరేటివ్ ఏఐ ఆధారిత వ్యక్తిగత సహాయకుడు లిలిఆల్-న్యూ అలెక్సాంలిలిను విడుదల చేసింది. మరింత తెలివిగా, వ్యక్తిగతీకరించిన సేవలతో పాటు భారతీయ వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా దీన్ని రూపొందించినట్లు సంస్థ తెలిపింది. ఇంగ్లిష్, హిందీ, హింగ్లిష్ భాషల్లో సహజమైన సంభాషణ ద్వారా వివిధ పనులను పూర్తి చేయగలదు.

స్మార్ట్ హోమ్ పరికరాల నియంత్రణ, ఆన్‌లైన్ షాపింగ్, భోజన ప్రణాళిక, రెస్టారెంట్ రిజర్వేషన్లు, ప్రయాణ ప్రణాళిక, సంగీతం, వినోదం వంటి అనేక సేవలను అలెక్సాం ద్వారా పొందవచ్చు. అర్హత కలిగిన ఎకో స్మార్ట్ స్పీకర్లు, స్మార్ట్ డిస్‌ప్లేలు, ఫైర్ టీవీ పరికరాలు, అలెక్సా మొబైల్ యాప్‌లో ఎర్లీ యాక్సెస్ కింద ఇది ఉచితంగా అందుబాటులో ఉంటుందని అమెజాన్ వెల్లడించింది.

అమెజాన్ ఇండియా అలెక్సా కంట్రీ మేనేజర్ టీనా సిదానా మాట్లాడుతూ.. భారతీయ కుటుంబాల బహుభాషా, బహుతరాల జీవన విధానాన్ని దృష్టిలో ఉంచుకుని అలెక్సాంను రూపొందించామని తెలిపారు. వినియోగదారుల మాటల వెనుక ఉన్న ఉద్దేశాన్ని అర్థం చేసుకుని, సందర్భానుసారంగా స్పందించేలా దీన్ని అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు.

అలెక్సాంలో ప్రతిసారీ 'అలెక్సా' అని పలకాల్సిన అవసరం లేకుండా సహజంగా సంభాషించవచ్చని సంస్థ తెలిపింది. సంభాషణ మధ్యలో అంశాలను మార్చినా, ఇంగ్లిష్-హిందీ మిశ్రమంగా మాట్లాడినా సందర్భాన్ని అర్థం చేసుకుని స్పందించే సామర్థ్యం దీనికి ఉందని పేర్కొంది. ప్రస్తుతం ఇంగ్లిష్, హిందీ, హింగ్లిష్ భాషలకు మద్దతు ఉండగా.. త్వరలో మరిన్ని భారతీయ భాషలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించింది.

## ప్రమాదపు అంచుల్లో "జర్నలిస్టులు"..!

- భద్రత లేని వర్కింగ్ జర్నలిస్టు
- సోషల్ మీడియాతో పెరుగుతున్న సవాళ్లు

జర్నలిజం నాకు కేవలం ఒక వృత్తి కాదు.. ప్రజల పక్షాన నిలబడే బాధ్యత. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, అధికారులను ప్రశ్నించడం, ప్రజా ప్రయోజన అంశాలను సమాజం ముందుంచడం జర్నలిస్టు ప్రధాన కర్తవ్యం. అయితే నేడు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల పరిస్థితిని చూస్తుంటే ఒక ప్రశ్న పదేపదే వెంటాడుతోంది.. జర్నలిస్టుకు భద్రత ఎక్కడ? సామాజికంగా, ఆర్థికంగా, ఉద్యోగపరంగా భరోసా లేని పరిస్థితుల్లో అనేక మంది జర్నలిస్టులు విధులు నిర్వహిస్తున్నారు. వార్త కోసం ఎండా వానా లెక్కచేయకుండా తిరుగుతారు. ప్రమాదకర పరిస్థితుల్లోకి వెళ్లి సమాచారాన్ని సేకరిస్తారు. ప్రజా సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తారు. కానీ అదే జర్నలిస్టుకు ఏదైనా ఇబ్బంది ఎదురైతే అండగా నిలిచే వ్యవస్థ ఎంత బలంగా ఉంది? అన్నది ఆలోచించాల్సిన అంశం.

#### నిజాన్ని రాస్తే దాడులు.. ప్రశ్నిస్తే కేసులు..!

ప్రజా ప్రయోజన అంశాలపై వార్తలు రాస్తున్నప్పుడు జర్నలిస్టులకు ఒత్తిళ్లు, బెదిరింపులు, దాడులు, కేసులు ఎదురవుతున్నాయనే ఆందోళనలు తరచూ వినిపిస్తున్నాయి. ఒక వార్త ఎవరికైనా నచ్చకపోవచ్చు. వార్తలో తప్పు ఉంటే ఖండించవచ్చు. వివరణ ఇవ్వవచ్చు. చట్టపరమైన మార్గాన్ని ఆశ్రయించవచ్చు. కానీ వార్త నచ్చలేదని జర్నలిస్టుపై దాడి చేయడం.. ప్రశ్నించాడని బెదిరించడం.. వార్త రాశాడని కేసులతో భయపెట్టడం ప్రజాస్వామ్య సంస్కృతికి ఆరోగ్యకరం కాదు. ఇదే సమయంలో ఏ జర్నలిస్టు కూడా చట్టానికి అతీతుడు కాదు. తప్పు చేసిన జర్నలిస్టుపై చట్టపరమైన చర్యలు ఉండాల్సిందే. అదే సమయంలో నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టు హక్కులు, వృత్తి స్వేచ్ఛ కూడా రక్షించబడాలి.

#### సోషల్ మీడియాతో కొత్త సవాళ్లు

సాంకేతికత సమాచార ప్రపంచాన్ని పూర్తిగా మార్చేసింది. యూట్యూబ్, వెబ్‌సైట్లు, ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి వేదికల ద్వారా సమాచారం క్షణాల్లో ప్రజలకు చేరుతోంది. ఇది ప్రజాస్వామ్యానికి ఒక అవకాశమే. అయితే ఈ అవకాశాన్ని బాధ్యతతో నిర్వహించాలి. సోషల్ మీడియాలో కనిపించిన సమాచారాన్ని వాస్తవ నిర్ధారణ లేకుండా మరోసారి ప్రచారం చేయడం, వ్యక్తిగత అభిప్రాయాలను వార్తలుగా చూపించడం, సంచలనానికి ప్రాధాన్యం ఇవ్వడం వంటి ధోరణులు ప్రజల్లో గందరగోళానికి దారితీస్తున్న నేపథ్యంలో సోషల్ మీడియా మీద ఆధారపడి జర్నలిజాన్ని కొనసాగించాలనే ధోరణి మన అస్థిత్వాన్ని ప్రశ్నార్ధకంగా మార్చేస్తుందనే విషయాన్ని గుర్తుంచుకుని ముందుకు సాగాలి.

#### మీడియా వేదిక ఏదైనా కావచ్చు..
#### కానీ జర్నలిజం ప్రమాణాలు మాత్రం మారకూడదు.

ఇదే క్రమంలో సోషల్ మీడియాలో పనిచేసే ప్రతి ఒక్కరినీ తక్కువగా చూడాల్సిన అవసరం లేదు. అలాగే సోషల్ మీడియా వేదికను ఉపయోగిస్తున్న ప్రతి ఒక్కరినీ వృత్తిపరమైన జర్నలిస్టుగా పరిగణించాల్సిన అవసరం కూడా లేదు. తేడాను గుర్తించాల్సింది ప్రజలే కాదు.. మీడియా సంస్థలు, జర్నలిస్టు సంఘాలు, ముఖ్యంగా రాజకీయ నాయకులు, అధికారులు, మన జర్నలిస్టు సమాజం కూడా.

#### తెలిసీ తెలియని కథనాలతో జర్నలిజానికి మచ్చ

వార్త రాయడం అంటే కేవలం ఒక సమాచారం అందించడం కాదు. దాని వెనుక వాస్తవం ఏమిటి? ఆధారం ఏమిటి? సంబంధిత వ్యక్తి స్పందన ఏమిటి? ప్రజా ప్రయోజనం ఎంత ఉంది? అనే ప్రశ్నలకు సమాధానం వెతకాలి. విన్న సమాచారాన్ని నిర్ధారించకుండా ప్రచురించడం.. ఒకవైపు సమాచారం మాత్రమే తీసుకుని తీర్పు చెప్పడం.. వ్యక్తిగత అభిప్రాయాలను వాస్తవాలుగా చూపడం.. ఇవన్నీ జర్నలిజం విశ్వసనీయతను దెబ్బతీసే అంశాలే. తెలియని విషయాన్ని తెలిసినట్లుగా చెప్పడం కంటే.. తెలియదని అంగీకరించడం జర్నలిస్టు నిజాయితీ. ఈ ఆత్మపరిశీలన ప్రతి జర్నలిస్టులో ఉండాలి. ఎందుకంటే మనం రాసే ప్రతి అక్షరం ఒకరి జీవితాన్ని ప్రభావితం చేసే శక్తి కలిగి ఉంటుంది.



#### వర్కింగ్ జర్నలిస్టు.. భద్రత లేని ఉద్యోగి?

క్షేత్రస్థాయిలో పనిచేసే జర్నలిస్టు పరిస్థితి గురించి చూసుకుంటే అనేక మంది జర్నలిస్టులు తక్కువ ఆదాయం, ఉద్యోగ భద్రత లోపం, సామాజిక భద్రత కొరత, పని ఒత్తిళ్ల మధ్య విధులు నిర్వహిస్తున్నారు. చిన్నపత్రికలు, చిన్న మీడియా సంస్థల్లో పనిచేసే జర్నలిస్టుల పరిస్థితి మరింత సవాలుగా ఉండొచ్చు. పెద్ద సంస్థలకు ఉండే వనరులు, న్యాయ సహాయం, భద్రతా వ్యవస్థలు ప్రతి చిన్న మీడియా సంస్థకు ఉండకపోవచ్చు.

ఇదే సమయంలో చిన్న పత్రికలో పనిచేసే జర్నలిస్టు హక్కులు చిన్నవి కావు. (స్మాల్ అండ్ మీడియం) చిన్న, మధ్య పత్రికల్లో పనిచేసే వర్కింగ్ జర్నలిస్టులకు సామాజిక, ఆర్థిక, ఉద్యోగ భద్రత కల్పించేందుకు మీడియా సంస్థల యాజమాన్యాలు ప్రభుత్వ సహాయంతో తమ వంతు కృషి చేయాలి.

#### ప్రజా ప్రయోజనమే కలం లక్ష్యం

జర్నలిస్టు చేతిలో ఉన్న గొప్ప ఆయుధం కలం. ఆ కలం వ్యక్తిగత కక్షల కోసం కాదు.. ప్రజా ప్రయోజనం కోసం కదలాలి. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య, రహదారుల దుస్థితి, ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి, ఆసుపత్రుల్లో సమస్యలు, రైతుల కష్టాలు, కార్మికుల హక్కులు, పేదల సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు.. ఇవన్నీ వార్తలే. ఒక చిన్న గ్రామం సమస్యను వెలుగులోకి తీసుకొచ్చిన కథనం అధికారులను కదిలించవచ్చు. ఒక నిరుపేద కుటుంబానికి న్యాయం చేయవచ్చు. ఒక పాఠశాలలో మార్పుకు కారణం కావచ్చు. అందుకే నా దృష్టిలో జర్నలిజం లక్ష్యం సంచలనం కాదు.. సమాజంలో మార్పు.

#### జర్నలిస్టుపై ముద్ర వేయడం సులభం.. నిజాన్ని తెలుసుకోవడం కష్టం

నేడు ఎవరిపైనైనా "నకిలీ జర్నలిస్టు" అనే ముద్ర వేయడం చాలా సులభమైపోయింది. జర్నలిజంలో నకిలీ జర్నలిస్ట్ అనే పదమే లేదన్న వాస్తవాన్ని అందరు గమనించాలి. జర్నలిస్ట్ పేరుతో అక్రమ వసూళ్లకు, బెదిరింపులకు పాల్పడేవారు ఉంటే వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలి. కానీ ఒక వ్యక్తిపై వచ్చిన ఆరోపణను ఆధారంగా చేసుకుని మొత్తం జర్నలిస్టు సమాజాన్ని అనుమానించడం సరికాదు. ముఖ్యంగా సోషల్ మీడియాలో నిర్ధారణ లేని ఆరోపణలను వైరల్ చేయడం మరొక వ్యక్తి ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రమాదం ఉంది. జర్నలిస్టు తప్పు చేస్తే ప్రశ్నిద్దాం.. కానీ జర్నలిస్టు అనే కారణంతోనే నిందించవద్దు.

#### క్షేత్రస్థాయి జర్నలిస్టుల భద్రత ఎవరి బాధ్యత?

వార్త కోసం బయటకు వెళ్లిన జర్నలిస్టు ఎదుర్కొనే ప్రమాదాలు ఎన్నో. ప్రమాద ఘటనలు, ఆందోళనలు, నేర సంఘటనలు, ప్రకృతి వైపరీత్యాలు, వివాదాస్పద ప్రాంతాలు.. ఏ సందర్భంలోనైనా జర్నలిస్టులు ముందువరుసలో ఉంటారు. అలాంటి పరిస్థితుల్లో వారికి కనీస భద్రత, అవసరమైన మార్గదర్శకాలు, చట్టపరమైన సహాయం అందుబాటులో ఉండాలి. జర్నలిస్టుపై దాడి జరిగితే అతను ఏ పత్రికలో పనిచేస్తున్నాడనే దానికంటే.. దాడి ఎందుకు జరిగింది? వాస్తవం ఏమిటి? అనే అంశాలపై నిష్పక్షపాత విచారణ జరగాలి.

#### ఐక్యత లేకపోతే భరోసా ఎలా?

జర్నలిస్టు సమాజం కూడా ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం వచ్చింది. ఒక జర్నలిస్టుపై దాడి జరిగినప్పుడు అది అతని వ్యక్తిగత సమస్యగా చూస్తే రేపు అదే సమస్య మరొకరి తలుపు తడుతుంది. సంఘాలు, యూనియన్లు, మీడియా సంస్థలు వృత్తి భద్రత కోసం కలిసి పనిచేయాలి. అదే సమయంలో మనలోని లోపాలను కూడా సరిదిద్దుకోవాలి. వృత్తి నైతికతను పాటించాలి. వాస్తవ నిర్ధారణకు ప్రాధాన్యం ఇవ్వాలి. తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయకూడదు.

హక్కుల కోసం ఐక్యత.. బాధ్యత కోసం ఆత్మపరిశీలన.. ఇదే జర్నలిస్టు సమాజానికి అవసరం.

#### కలం భయపడకూడదు.. బాధ్యత మరువకూడదు

జర్నలిస్టుకు ప్రశ్నించే ధైర్యం ఉండాలి. నిజాన్ని చెప్పే నిబద్ధత ఉండాలి. అదే సమయంలో తన ప్రతి అక్షరానికి బాధ్యత వహించే సంస్కారం కూడా ఉండాలి.

ప్రభుత్వాలు జర్నలిస్టుల భద్రతపై దృష్టి పెట్టాలి. మీడియా సంస్థలు తమ సిబ్బందికి భరోసా కల్పించాలి. జర్నలిస్టు సంఘాలు క్షేత్రస్థాయి జర్నలిస్టుల సమస్యలను ముందుకు తీసుకెళ్లాలి. ప్రజలు కూడా వాస్తవాధారిత జర్నలిజాన్ని ప్రోత్సహించాలి.

#### ఎందుకంటే..

జర్నలిస్టుకు భద్రత ఉంటేనే కలం స్వేచ్ఛగా కదులుతుంది. కలం స్వేచ్ఛగా కదిలితేనే ప్రజల గొంతుక బలంగా వినిపిస్తుంది.ప్రజల గొంతుక బలంగా ఉంటేనే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది.

**వ్యాసకర్త**
**అఫ్జల్ పఠాన్**
**ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్**
**9703247143**

# కోలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇస్తున్న కేతిక శర్మ..




టాలీవుడ్‌లో వరుస చిత్రాలతో ప్రేక్షకులను పలకరించినప్పటికీ, ఆశించిన స్థాయిలో సక్సెస్ అందుకోలేకపోయిన అందాల భామ కేతిక శర్మ. 'రొమాంటిక్' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన ఈ అమ్మడు.. ఆ తర్వాత 'లక్ష్య', 'రంగరంగ వైభవంగా', 'బ్రో' వంటి పలు సినిమాల్లో నటించి గ్లామర్‌తో మెప్పించారు. అయితే బాక్సాఫీస్ వద్ద మాత్రం ఆమెకు సరైన హిట్ దక్కలేదు. దీంతో టాలీవుడ్‌లో కొద్దిగా విరామం తీసుకున్న ఈ సుందరి, ఇప్పుడు తన అదృష్టాన్ని కోలీవుడ్‌లో పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. 'మీసయ్య మురుక్కు-2' సినిమాతో ప్రేక్షకులను అలరించబోతున్నారు. టాలెంటెడ్ ఆర్టిస్ట్ ఆది నటిస్తూ స్వయంగా డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో కేతిక కీలక పాత్రలో కనిపించబోతున్నారు.

గతంలో వచ్చిన బ్లాక్ బస్టర్ హిట్ సినిమాకు ఇది సీక్వెల్‌గా వస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై కోలీవుడ్‌లో మంచి అంచనాలు ఉన్నాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో.. సినిమా ప్రమోషన్స్ జోరుగా సాగుతుండగా, కేతిక తాజాగా మీడియాతో ముచ్చటించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తమిళంలో తనకు ఇదే మొదటి సినిమా అని చెబుతూ కేతిక తన ఆనందాన్ని పంచుకున్నారు. తనకు తమిళం కొంతవరకు అర్థమైనా, మాట్లాడటం మాత్రం పూర్తిగా రాదని తెలిపారు. అయితే ఆ భాషపై పట్టు సాధించేందుకు తాను ఏకంగా నెల రోజుల పాటు ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం తాను తమిళ తరగతులకు హాజరవుతున్నానని, ఈ లెర్నింగ్ ప్రాసెస్ తనకు అద్భుతమైన అనుభవాన్ని ఇస్తోందని చెప్పారు. తమిళనాడు ప్రజల ఆదరణ గురించి మాట్లాడుతూ ఆమె ఎమోషనల్ అయ్యారు. అక్కడి ప్రజలంటే తనకు చాలా ఇష్టమని, తాను చెన్నైకి వెళ్లిన ప్రతీసారి అక్కడి ప్రేక్షకులు, కోలీవుడ్ నటీనటులు తనకు ఇచ్చిన స్వాగతం మరువలేనిదని తెలిపారు. అక్కడ తనకు కేవలం అపారమైన ప్రేమ, ఆప్యాయత మాత్రమే దొరికాయని, అందుకు తాను ఎంతో కృతజ్ఞురాలినని చెప్పారు. తమిళ పరిశ్రమతో తన మనసు పూర్తిగా మమేకమైపోయిందని, ఇక్కడి వాతావరణం చూస్తుంటే తన సొంత ఇంట్లో ఉన్నట్లే ఉ ంటుందని కేతిక చెప్పుకొచ్చారు.

## పా. రంజిత్ 'వెట్టువం' ఫస్ట్ గ్లింప్స్ విడుదల




కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు పా. రంజిత్ తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వెట్టువం'. నీలం ప్రొడక్షన్స్ మరియు లెర్న్ అండ్ టీచ్ ప్రొడక్షన్స్ పతాకాలపై రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాకు సంబంధించిన 'వరల్డ్ ఆఫ్ వెట్టువం' పరిచయ వీడియోను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఆర్య, శోభితా ధూళిపాళ్ల మరియు వి.ఆర్. దినేష్ ప్రధాన పాత్రలలో నటిస్తున్న ఈ చిత్రంపై ప్రస్తుతం భారీ అంచనాలు నెలకొన్నాయి.

పురాతన కాలం, సమకాలీన కాలం మరియు భవిష్యత్తు అనే మూడు వేర్వేరు కాలాల నేపథ్యంలో ఈ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ కథ సాగనుంది. ఆదికాల ప్రజల జీవన విధానం నేటి సమాజంపై చూపిన ప్రభావం, ప్రకృతిలో జరిగే పరిణామాలు మరియు భవిష్యత్తులో రాబోయే వినాశకరమైన మార్పులపై ఈ చిత్రం చర్చించనుంది. ఈ మూడు కాలాలలోనూ మానవ జాతిలో ఉండే ఆధిపత్య పోరు, పవర్ పాలిటిక్స్ మరియు "ఈ భూమిని ఎవరు ఏలాలి?" అనే ఘర్షణ చుట్టూ కథ తిరుగుతుంది. ఆహారం లేదా ఆత్మరక్షణ కోసం కాకుండా, వేర్వేరు జాతులు తాము ఏ స్థాయిలో బలశాలురమో నిరూపించుకోవడానికి చేసే పోరాటమే ఈ చిత్ర ప్రధానాంశం.

పురాతన యుద్ధ కళలైన 'అడిమురై' మరియు సంప్రదాయ ఆత్మరక్షణ విద్యల ఆధారంగా ఈ చిత్రంలో యాక్షన్ సన్నివేశాలు ఉండబోతున్నాయి. ఇందుకోసం నటీనటులు ప్రత్యేక శిక్షణ కూడా తీసుకున్నారు. చిత్రంలో జరిగే ఒక ప్రత్యేకమైన 'ఇంద్ర విశా' పోటీలో గెలిచిన వారికి అత్యున్నత నాయకత్వ పదవి దక్కుతుంది; ఆ అధికారాన్ని దక్కించుకోవడానికి నాయకులు సాగించే భీకర పోరాటం ఈ చిత్రంలో హైలైట్ కానుంది. 'సర్పట్ట పరంపరై' తర్వాత పా. రంజిత్, ఆర్య కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం కావడంతో దీనిపై మరింత ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో కలైయరసన్, మైమ్ గోపి, గురు సోమసుందరం, షబ్బీర్ కల్లరక్కల్, జాన్ విజయ్ తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాకు రూపేష్ షాజీ సినిమాటోగ్రఫీ, సెల్వ ఆర్‌కే ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ భారీ యాక్షన్ చిత్రాన్ని ఈ ఏడాది డిసెంబర్‌లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## కుటుంబ కథా చిత్రంగా 'కళ్యాణం కమనీయం జీవితం'..

### ఈ నెల 25న గ్రాండ్ రిలీజ్!



టాలీవుడ్‌లో సరికొత్త ప్రయోగాత్మక చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్న వివిపై మీడియా ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై రూపొందిన తాజా చిత్రం 'కళ్యాణం కమనీయం జీవితం'. ఖాన్ దురాని, సాహితి ఆవంచ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు రవి లోకిరెడ్డి దర్శకత్వం వహిస్తు న్నారు. పైలా ప్రసాద్ రావు, కిషోర్ గుండాల సంయుక్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. వైవిధ్యమైన కథాంశంతో రూపుదిద్దుకున్న ఈ సినిమా ఈ నెల 25న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా థియే టర్లలో విడుదల కానుంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ రాజవంశీ ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో చిత్ర యూనిట్ తాజాగా హైదరాబాద్‌లో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి సినిమా విశేషాలను పంచు కున్నారు. ప్రపంచ పటాలు పరిశీలించండి

ఈ సందర్భంగా నిర్మాత పైలా ప్రసాద్ రావు మాట్లా డుతూ.. తాము ఇటీవల ఈ సినిమాను కొంత మంది శ్రేయోభిలాషులు, మీడియా మిత్రులకు ప్రత్యేకంగా ప్రదర్శించామని, సినిమా చూసిన ప్రతీ ఒక్కరూ ఎంతో అద్భుతంగా ఉందని ప్రశంసించారని తెలిపారు. లెజెండరీ రైటర్ విజయేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా పోస్టర్ విడుదల కావడం, ప్రముఖ దర్శకుడు వి.వి. వినాయక్ ఈవెంట్‌కు వచ్చి ఆశీర్వదించడం తమ చిత్రానికి లభించిన గొప్ప అదృష్టమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా ఫ్యామిలీ మరియు యూత్ ఆడియన్స్‌ను అలరించే చక్కటి ఎంటర్ టైనర్ అని, సినిమా చిన్నదైనా కంటెంట్ మాత్రం చాలా బలంగా ఉంటుందని పేర్కొన్నారు.

దర్శకుడు రవి లోకిరెడ్డి మాట్లాడుతూ.. టైటిల్ వినగానే నిర్మాతలు ఎంతో ఇష్టపడి ఈ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. ఈ చిత్రంలో మంచి భావోద్వేగాలు, ఆకట్టుకునే పాటలతో పాటు ఊహించని అనేక ట్విస్టులు ఉంటాయని, థియేటర్‌కు వచ్చిన ప్రతి ప్రేక్షకుడు పెట్టిన ప్రతీ రూపాయికి పూర్తి స్థాయి వినోదాన్ని పొందుతార ని ధీమా వ్యక్తం చేశారు. నూతన నటీనటులైనప్పటికీ అందరూ తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారని, లెజెండరీ నటుడు సత్యానంద్ గారి పర్యవేక్షణలో నటన మరింత రంజుగా వచ్చిందని పేర్కొన్నారు. హీరో ఖాన్ దురాని మాట్లాడుతూ.. తమ సినిమా ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి ఊహించని విధంగా భారీ స్పందన లభించిందని తెలిపారు. నాని నటిస్తున్న 'పార డైజ్' సినిమాతో పాటు తమ సినిమా విడుదల కావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, తాను నాని గారికి పెద్ద అభిమానినని, ఆయన సినిమాలే తనకు స్ఫూర్తి అని చెప్పారు. ఎంతో ప్రేమతో తెరకెక్కించిన ఈ చక్కటి కుటుంబ కథా చిత్రాన్ని ప్రేక్షకులు థియేటర్లలో చూసి ఆశీర్వదించాలని కోరారు. హీరోయిన్ సాహితి ఆవంచ మాట్లాడుతూ.. ఈ చిత్రంలో తనకు అవకాశం కల్పించిన దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు తెలుపు తూ, ప్రేక్షకులు ఈ సినిమాను చూసి తమను మరింత ఆదరించాలని కోరారు. ఈ చిత్రంలో ఉ దయ్ పులిమి, విషిక, సత్యానంద్ లంక, కాకినాడ నాని తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఎస్.సి. అరవింద్ ఏకలవ్య మాటలు అందించగా, శ్రీ మురళీ కార్తికేయ సంగీతం సమకూర్చారు. ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి.

## 'జాంబీ రెడ్డి 2' నుంచి రియల్ స్టార్ ఫస్ట్ లుక్ రిలీజ్!




కన్నడ రియల్ స్టార్ ఉపేంద్ర పుట్టినరోజు సందర్భంగా టాలీవుడ్ మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ 'జాంబీ రెడ్డి 2' నుంచి మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాకు సంబంధించిన ఉ పేంద్ర ఫస్ట్ లుక్‌ను విడుదల చేయగా, ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ పోస్టర్ తెగ వైరలవుతోంది.

ప్రపంచాన్ని తలకిందులు చేసేందుకు రియల్ స్టార్ సిద్ధమవుతున్నారంటూ చిత్రబృందం విడుదల చేసిన ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. ఇప్పటివరకు వెండితెరపై ఎన్నడూ చూడని సరికొత్త, వైవిధ్యమైన అవతార్‌లో ఉ పేంద్ర కనిపించబోతున్నారని మేకర్స్ తెలిపారు. ఆయన పాత్రలో కనిపించే మ్యాడ్‌నెస్, మరియు మాస్ కలగలిసిన సరికొత్త ఫ్లేవర్ ప్రేక్షకులను ఖచ్చితంగా షాక్‌కు గురిచేసేలా ఉంటుందని యూనిట్ పేర్కొంది.

సూపర్‌హీరో తేజ సజ్జాతో కలిసి ఉపేంద్ర స్క్రీన్ షేర్ చేసుకోబోతుండటం ఈ సినిమాకు ప్రధాన హైలైట్ కానుంది. వీరిద్దరి కలయికలో వచ్చే మాస్ రచ్చ ఎలా ఉండబోతుందనే ఆసక్తి ప్రస్తుతం సర్వత్ర నెలకొంది. మొత్తానికి 'జాంబీ రెడ్డి 2' తో రాబోతున్న ఈ నెక్స్ట్ లెవెల్ మ్యాడ్‌నెస్ కోసం ప్రేక్షకులు, అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

## 'వెట్టువం' కోసం నా సర్వస్వాన్ని ధారపోశా..

### సగం ఫైట్లు నాకే దక్కాయంటూ శోభిత ఆసక్తికర కామెంట్స్



అందాల భామ శోభిత ధూళిపాళ సెకండ్ ఇన్నింగ్స్‌లో ఫుల్ ఫామ్‌లో ఉన్నారు. వివాహం తర్వాత 'చీకటిలో' అనే క్రైమ్ థ్రిల్లర్‌తో ప్రశంసలు అందుకున్న ఆమె ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ పా. రంజిత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పాన్ ఇండియా చిత్రం 'వెట్టువం'లో శోభిత హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఆర్య, శోభిత ధూళిపాళతో పాటు దినేష్ ప్రధాన పాత్రలలో కనిపించనున్నారు. ఈ సినిమాకు జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు చాలా ఘనంగా జరిగాయి. షూటింగ్‌ను కూడా ప్రారంభించిన మేకర్స్, ఒక స్పెషల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇక ఈ ఈవెంట్‌లో పాల్గొన్న శోభిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పా. రంజిత్ సినిమాల్లోని స్త్రీలు ఎప్పుడూ ఇతరుల రక్షణ కోసం ఎదురుచూడరని, తమ సొంత హృదయం చెప్పిన మార్గంలో స్వతంత్రంగా నడుస్తారని ప్రశంసించారు. 'వెట్టువం'లో తాను పోషిస్తున్న పాత్ర గురించి చెబుతూ.. ఈ సినిమాలో తన పాత్ర ఎన్నో పోరాటాలతో సాగుతుందని, పూర్తిగా తన సొంత నిర్ణయాల ద్వారానే ముందుకు వెళ్తుందని తెలిపారు.

తాను ఎంచుకునే పాత్రలకు భావోద్వేగాల పరంగా పూర్తిగా కనెక్ట్ అవుతానని, 'వెట్టువం'లో నటించేటప్పుడు తన సర్వస్వాన్ని ధారపోశానని శోభిత చెప్పారు.

## 'మగాళ్లు జిందాబాద్' ఫస్ట్ లుక్ విడుదల..

### కడుపుబ్బా నవ్వించడానికి సిద్ధమైన నందు



టాలీవుడ్ యంగ్ హీరో శ్రీనందు వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. ఫలితాలతో సంబంధం లేకుండా విభిన్నమైన కథలు, ప్రత్యేకమైన కాన్సెప్ట్‌లను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన,ఇటీవల 'అగ్లీ స్టోరీ' చిత్రంతో పలకరించారు. తాజాగా, తన కొత్త సినిమాను అనౌన్స్ చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. శ్రీనందు , లక్ష్మీ, టాలీవుడ్ స్టార్ కమెడియన్లు వెన్నెల కిషోర్, వైవా హర్ష ప్రధాన పాత్రలలో నటిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కి 'మగాళ్లు జిందాబాద్' అనే ఫన్నీ టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో నవ్వులు పూయిస్తోంది. ఇందులో శ్రీనందు, వెన్నెల కిషోర్, వైవా హర్ష ముగ్గురూ పూల దండలతో విభిన్నంగా కనిపించి ఆకట్టుకుంటున్నారు. ఇక విడుదలైన వీడియోలో ముందుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను చూపించగా, ఆ తర్వాత హీరోయిన్ లక్ష్మి ఎంట్రీ హైలైట్‌గా నిలిచింది. ఈ సినిమాలో హీరో శ్రీనందు 'గన్నెల్' అనే పాత్రలో కనిపించబోతున్నారని, ఆయన శారదాంబ హోటల్‌ను నిర్వహిస్తూ ఈ రోల్‌లో అలరిస్తారని మేకర్స్ తెలిపారు. మరోవైపు వైవా హర్ష 'ఈగల్'గా, వెన్నెల కిషోర్ 'ముక్కోడు' అనే ఒక కటింగ్ షాప్ ఓనర్‌గా తమదైన శైలిలో కడుపుబ్బా నవ్వించడానికి సిద్ధమయ్యారు. నారా ప్రవీణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని గోల్డెన్ ఆర్క్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాతలు ప్రసాద్ భాస్కర్ల, చైతన్య వంగవరపు సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాకు శ్రీ చరణ్ పాకాల మరియు మదిన్ కలిసి సంగీతం అందిస్తున్నారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com